Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 81 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 ఏప్రిల్ 2023 గురువారం పేజీలు : 4

### కాంగ్రెస్, విపక్షాల ఐక్యతకు రంగంలోకి దిగిన నితీష్

న్యూఢిల్లీ: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలను బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీష్ కుమార్ వేగవంతం చేస్తున్నారు. మూడు రోజుల పర్యటన కోసం న్యూఢిల్లీ వచ్చిన నితీష్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు విపక్ష నేతలతో విడివిడిగా సమావేశమవుతు న్నారు. విపక్షాలు ఐక్యం కావలసిన అవసరంపై మల్లికార్జున ఖర్గే నుంచి ఫోను రావడంతో నితీష్ తాజా యత్నాలు సాగిస్తున్నారు.

**లాలూతో భేటీ..** ఢిల్లీకి చేరుకున్న నితీష్ కుమార్ ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్‌ను కలుసుకున్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితి, 2024 పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు విపక్షాల ఐక్యతను ఏవిధంగా పటిష్టం చేయాలనే అంశంపై ఉభయులూ చర్చించారు.

# గ్రేటర్ 'కారు'లో 'ఆత్మీయ' ఘోష!




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు119. ఇందులో ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 23 ఉన్నాయి. వీటికి చేవెళ్ల.. ఇబ్రహీంపట్నం కలిపితే పాతిక స్థానాలు ఉన్నాయి. అంటే.. రాష్ట్రంలోని మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20 శాతం స్థానాలు గ్రేటర్ పరిధిలోనే ఉన్నాయన్న మాట. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా.. ఈ సీట్లలో ఎక్కువ ఎవరి పరమవుతాయో వారు చక్రం తిప్పే వీలుంది. ఈ పాతికసీట్లలో ఆరు సీట్లు మజ్లిస్ ఖాతాలోకే వేయాలి. ఏ పార్టీ హవా ఎంత ఉన్నా.. మజ్లిస్ ఏలుబడిలో ఉన్న పాతబస్తీలో మాత్రం గాలిపటం జెండా ఎగరాలే కానీ.. మరే పార్టీ జెండా ఎగిరే పరిస్థితి ఉండదు. అలా చూసుకున్నా.. పాతికలో ఆరు స్థానాలు తీసేస్తే.. 19 స్థానాలు ఉంటాయి. ఇప్పటికైతే ఈ స్థానాల్లో దాదాపుగా అధికార బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. అయితే.. వరుసగా రెండుసార్లు అధికార పార్టీగా ఉన్న గులాబీ పార్టీలో గడిచిన కొంతకాలంగా లుకలుకలు ఎక్కువ అవుతున్నాయి. పార్టీ నేతల మధ్య అధిపత్య పోరు అంతకంతకూ ముదురుతోంది. దీంతో.. వారి మధ్య గ్యాప్ పెరుగుతున్న పరిస్థితి. పెరిగిన దూరం ఎంతన్న విషయాన్ని ఇటీవల నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సమావేశాలు అయితే ఆత్మ లేని ఆత్మీయ సమావేశాలుగా మారాయన్న మాట బలంగా వినిపిస్తోంది. నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాల నడుమ నడుస్తున్న ఆత్మీయ సమావేశాలు చప్పగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల మాత్రం అసమ్మతి రాగాలు వినిపిస్తే.. మరికొన్నిచోట్ల గైర్హాజరీలు నమోదవుతున్నాయి. ఇంకొన్ని చోట్ల పంచాయితీలు లేకుండా చేయటం కోసం అసలు ఆత్మీయ సమావేశాలే నిర్వహించకుండా నిలిపేస్తున్న పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్ది నెలలే మిగిలి ఉన్న వేళ.. నేతల మధ్య పెరిగిన దూరం పార్టీని కొంప ముంచే ప్రమాదం ఉందన్న మాట వినిపిస్తోంది. ముషీరాబాద్ మల్కాజిగిరి అంబర్ పేట ఎల్ బీ నగర్ గోషామహల్ చేవెళ్ల ఇబ్రహీంపట్నం జూబ్లీహిల్స్ ఉప్పల్ కుత్బుల్లాపూర్ తదితర నియోజకవర్గాల్లో గులాబీ నేతల మధ్య విభేదాలు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. ఇదే తీరు సాగితే.. వచ్చే ఎన్నికల్లో బొమ్మ మారేప్రమాదం ఉందంటున్నారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన ఆత్మీయ సమావేశాలకు సంబంధించిన ఫీడ్ బ్యాక్ ను అధినాయకత్వం సేకరిస్తే.. పార్టీ అంతర్గతరంగా ఉన్న లుకలుకలు వెలుగు చూసే అవకాశం ఉందంటున్నారు. ఆ విషయంలో ఏ మాత్రం లోపం జరిగినా ఎదురయ్యే నష్టం ఎక్కువగా ఉంటుందంటున్నారు. గ్రేటర్ లుకలుకలపై గులాబీ బాస్ ఏం చేస్తారో చూడాలి.

# కర్ణాటక ఎన్నికలను శాసిస్తున్న ఆ 'ఒక్క' కులం !



కర్నాటక ఎన్నికలు దగ్గరకు వచ్చేస్తున్న కొద్దీ పార్టీలన్నీ సామాజికవర్గాల చుట్టే ప్రదక్షిణాలు చేస్తున్నాయి. ఈ సామాజిక వర్గాల్లో కూడా ఒక్కలిగల ప్రాబల్యం బాగా ఉండటంతో ప్రధాన పార్టీలన్నీ వీళ్ళని ప్రసన్నం చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాయి. కర్నాటకలో రెండు కులాలు మొదటినుండి చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయి. మొదటిదేమో లింగాయతులు. రెండో సామాజికవర్గం ఒక్కలిగలు. ఒక అంచనా ప్రకారం 15 శాతం ఉన్న ఒక్కలిగలు దాదాపు 100 నియోజకవర్గాల్లో ప్రభావం చూపించగలరు. పాత మైసూరు ప్రాంతంలో బాగా ప్రాబల్యం కలిగున్నారు. రామనగర మాంఢ్య మైసూరు చామరాజనగర కొడగు కోలార్ తుముకూరు హసన్ జిల్లాల పరిధిలోని సుమారు 60 నియోజకవర్గాల్లో ఒక్కలిగల జనాభానే ఎక్కువ. ఇపుడు జేడీఎస్ కు 24 కాంగ్రెస్ 18 బీజేపీకి 15 సీట్లున్నాయి. పై ప్రాంతాలతో పాటు బెంగుళూరు అర్బన్ జిల్లాలో 28 నియోజకవర్గాలు రూరల్ జిల్లాలో 4 నియోజకవర్గాలు చిక్ బళాపూర్లో 8 నియోజకవర్గాల్లో వీళ్ళు బలంగా ఉన్నారు. ఇంతటి కీలకమైన కమ్యూనిటీని తన వైపు తిప్పుకునేందుకు బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తోంది.

4 శాతం రిజర్వేషన్ను 6కి పెంచింది. అలాగే ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన స్వామీజీలతో కూడా తనకు మద్దతుగా బీజేపీ మాట్లాడిస్తోంది. కర్నాటక ఎన్నికల్లో మఠాలు పీఠాల ప్రభావం కూడా ఉంటుంది. అందుకనే ఇక్కడ స్వామీజీలకు బాగా డిమాండ్. ప్రధానమంత్రిగా చేసిన దేవేగౌడ ముఖ్యమంత్రిగా పనిచేసిన కుమారస్వామి ఒక్కలిగలే. వీళ్ళు కాకుండా మరికొందరు కేంద్రంలో మంత్రులుగా కూడా పనిచేశారు. బీజేపీ పద్దతిలోనే దేవేగౌడ కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా ఒక్కలిగలను ప్రసన్నం చేసుకునేందుకు తంటాలు పడుతున్నారు. ముందు వీళ్ళని ప్రసన్నంచేసుకుంటే తర్వాత లింగాయతుల దగ్గరకు వెళ్ళచ్చని పార్టీలు అనుకుంటున్నాయి. సామాజికవర్గం మద్దతుకోసం ఈమధ్యనే బీజేపీ ప్రభుత్వం కెంపేగౌడ 108 అడుగుల విగ్రహాన్ని బెంగుళూరు విమానాశ్రయం దగ్గర ఏర్పాటుచేసింది. మరి సామాజికవర్గాలు ఏ పార్టీని ఆదరిస్తాయో ఎవరికీ అర్ధంకాకుండా ఉంది. కొన్ని సర్వేలేమో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఫలితాలను ప్రకటించాయి. చివరకు ఏమవుతుందో ఏమో చూడాల్సిందే.




# ఇద్దరు మృతి.. 8 మందికి గాయాలు

కారేపల్లి: భారాస ఆత్మీయ సమ్మేళనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. నేతలు వస్తున్న సందర్భంగా కాల్చిన బాణసంచా అగ్నిప్రమాదానికి కారణమైంది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. 8 మంది గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో భారాస ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములు నాయక్ హాజరయ్యారు. నేతలు వస్తున్న క్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు బాణసంచా కాల్చారు. బాణసంచా నిప్పురవ్వలు పక్కనే ఉన్న గుడిసెపై పడటంతో మంటలు చెలరేగాయి. వాటిని అదుపు చేసేందుకు అక్కడే ఉన్న పోలీసులు, స్థానికులు బిందెలతో నీళ్లు చల్లారు. మంటల తాకిడికి గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను ఎవరూ గమనించలేదు. ఈ క్రమంలో అది ఒక్కసారిగా పెద్దశబ్దంతో పేలింది. ఆ పేలుడు ధాటికి ఏడుగురు తీవ్రంగా గాయపడగా.. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసు వాహనాల్లో ఖమ్మం తరలించారు. తీవ్రంగా గాయపడినవారిలో ఒకరు మార్గంమధ్యలో చనిపోగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే రద్దు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

**మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి :** అగ్నిప్రమాదంపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు, పార్టీ నేతలతో ఆయన మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. మృతుడు, క్షతగాత్రుల కుటుంబాలకు అండగా ఉంటామని కేటీఆర్ చెప్పారు.

# వ్యవసాయరంగాభివృద్ధికి తెలంగాణ పెద్దపీట : మంత్రి కేటీఆర్



రాజన్న సిరిసిల్ల : సీఎం కేసీఆర్ ఆశీస్సులతో, నాటి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రోద్భలంతో, ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ కాలేజీని ఏర్పాటు చేసుకుని ఇవాళ ప్రారంభించుకున్నాం అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయ కళాశాలలోని వసతులను సద్వినియోగం చేసుకుంటే దేశానికే గర్వకారణంగా నిలిచే శాస్త్రవేత్తలు, అగ్రానమిస్టులు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, వసతులను సద్వినియోగం చేసుకుంటే.. మన వ్యవసాయ రంగం దేశానికి దిక్సూచిగా మారుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

తంగళ్లపల్లి మండలం జిల్లెల శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ కాలేజీని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రులు నిరంజన్ రెడ్డి, కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ విస్తరణ జరిగిందని తెలిపారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చేటప్పుడు వరుసగా కొండ పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్, మిడ్ మానేరు జలశయాలు చూస్తూ వచ్చాము. ఆ రిజర్వాయర్లన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. కళ్లు ఉండి చూడలేని వారు.. కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరానికి నీరు వచ్చిందా? అని నటిస్తూ మాట్లాడుతున్నారు. తెలంగాణ రాక ముందు ఒక్క రిజర్వాయర్ లేదు. ఈ రిజర్వాయర్‌ల కింద లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్‌కు రైతులు కొత్త నిర్వచనం చెబుతున్నారని మంత్రి తెలిపారు. కే అంటే కాల్వలు, సీ అంటే చెరువులు, ఆర్ అంటే రిజర్వాయర్లు అని రైతులు అనుకుంటున్నారు.

రైతు బంధు ఇస్తున్న కేసీఆర్‌ను రైతులు తమ గుండెల్లో నిక్షిప్తం చేసుకున్నారు. దండగ అన్న వ్యవసాయాన్ని సీఎం కేసీఆర్ నేడు పండుగగా చేశారు అని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామిక వేత్తలుగా, ఎంటర్ ప్రెన్యూర్స్‌గా ఎదగాలన్నారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసుకున్న అగ్రి హబ్ శాటిలైట్ క్యాంపస్ ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలి. వ్యవసాయ కళాశాలను పీజీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కేటీఆర్ కోరారు.



# సంపాదకీయం

## బీఆర్ఎస్ హైజాక్ చేస్తోందా ?

రాబోయే ఎన్నికల్లో ఏపీలో ఉనికి చాటుకోవాలని ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీ ఇష్యూని హైజాక్ చేయాలని చూస్తున్నట్లుంది. విశాఖ స్టీల్స్ ను నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు ఓపెన్ బిడ్డింగ్ రూపంలో ప్రకటనలు కూడా ఇస్తోంది. ప్రైవేటీకరణను ఒకవైపు ఫ్యాక్టరీ ఉద్యోగులు కార్మికులు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మోదీ మాత్రం తన ప్రయత్నాల నుండి వెనక్కు తగ్గటం లేదు. ఒకవైపు కేంద్రం తనపని తాను చేసుకుపోతుంటే రాష్ట్రంలో వైసీపీ-టీడీపీ నేతలు మాత్రం ఒకళ్ళపై మరొకళ్ళు ఆరోపణలు విమర్శలు చేసుకుంటు కాలం గడిపేస్తున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీల మధ్య అనైక్యతను అర్థం చేసుకున్న తర్వాతే ఏపీ ప్రయోజనాలను మోదీ తుంగలో తొక్కేస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే బీఆర్ఎస్ విశాఖపట్నంలో కాలుపెట్టింది. వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడుతోంది. ఏపీలో ప్రభావం చూపించాలని అనుకున్న కేసీఆర్ మొదట గా విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ అంశాన్ని ఎత్తుకున్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా తీవ్రంగా విరుచుకుపడ్డారు. తర్వాత మంత్రి కేటీఆర్ తో పాటు చాలామంది మాట్లాడారు. తాజాగా వైజాగ్ స్టీల్స్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలో బీఆర్ఎస్ పెద్ద సమావేశాన్నే నిర్వహించింది. బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. కార్మికులు ఉద్యోగుల పక్షాన ఎన్ని పోరాటాలు ఉద్యమాలకైనా వెనకాడేది లేదన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు కేంద్రంలోని మోదీ ముందు మోకరిల్లినట్లు ఘాటు విమర్శలు చేశారు. మోదీ ప్రాపకం కోసం ఇద్దరు ప్రయత్నిస్తున్నారు కాబట్టి విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీ అంశాన్ని పక్కనపెట్టేసినట్లు మండిపోయారు. నిజానికి స్టీల్ ఫ్యాక్టరీ విషయంలో జగన్ చంద్రబాబు ఏకమైతే కేంద్రం ముందడుగు వేసే అవకాశం లేదని జనాలు ఎప్పటినుండో అనుకుంటున్నదే. ఇద్దరు కలిసి పోరాటాలు చేయాలని కార్మికసంఘాలు ప్రజాసంఘాలు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా వీళ్ళిద్దరు పట్టించుకోలేదు. రాష్ట్ర పార్టీల్లోని అనైక్యత కారణంగానే తెలంగాణాలో పుట్టిన బీఆర్ఎస్ ఏపీలో అడుగుపెట్టి ధైర్యంగా ఇద్దరిపైనా ఆరోపణలు చేయగలుగుతోంది. మరీ వ్యవహారం ఎటు వెళుతుందో చూడాల్సిందే.

# కొత్వాల్‌గూడకు కొత్త సమస్య



శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ గ్రామానికి కొత్త సమస్య వచ్చిపడింది. దీంతో గ్రామస్థులు తాజా మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే ప్రకాషగౌడ్‌ను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆర్డీవోకు సమస్యను వివరించారు. దసరా తర్వాతసమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పడంతో గ్రామస్తులు తేలికపడ్డారు. మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్‌లు, రైతులు మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. కొత్వాల్‌గూడ గ్రామంలోని భూములు ఎనిమీ ప్రాపర్టీ అన్న విషయంపై కొన్ని సంవత్సరాలుగా వివాదం సాగుతోంది. ఈ సమస్యను గతంలో ఆ ఊరును అమ్ముకుంటాం.. అనుమతి ఇవ్వండి' అన్న శీర్షికతో వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో ప్రభుత్వం ఈ సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం చూపింది. అయితే ఈ గ్రామంలోని భూములు ఎనిమీ ప్రాపర్టీ అని తేలిందని.. భూములు సాగు చేసుకుంటున్న రైతులు 30వ తేదీ లోగా తమ భూములకు సంబంధించిన వివరాలు ఆధారాలతో నిరూపించుకో వాలని కేంద్రప్రభుత్వం ఆధీనంలోని మంత్రిత్వశాఖ రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేసింది. అయితే, ఈ విషయం మీడియాకు తెలిస్తే వివాదం అవుతుందని కొందరు అధికారులు గ్రామస్థులను భయపెట్టడంతో ఈ విషయం బయటకు రాలేదు. అయుతే, తమ భూములు ఉంటాయో.. పోతాయోనన్న భయంలో కొందరు గ్రామస్థులున్నారు. దీంతో వారు తమ సమస్యను స్థానిక మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసగౌడ్, కృష్ణయ్యలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే ప్రకాషగౌడ్‌కు విన్నవించారు. ఆయ న వెంటనే ఆర్టీవో చంద్రకళతో మాట్లాడి కొత్వాల్‌గూడ వివాదాన్ని పరిష్కారం చేయాలని కోరారు. దసరా సెలవులు అయిపోగానే ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని ఆర్డీవో చెప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.అయినా, స్థానికులు మాత్రం ఇంకా భయపడుతూనే ఉన్నారు.

నోటీసుల జారీతో అలజడి

కేంద్ర ప్రభుత్వ అధికారి సోమవారం కొత్వాల్‌గూడకు వచ్చి గ్రామ రైతులకు నోటీసులు ఇచ్చా రు. ఈ భూములు ఎనిమీ ప్రాపర్టీవి అని చెప్పడంతో గ్రామంలో అలజడి మొదలైంది. దీంతో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించాం.

సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తు న్నాం.– శ్రీనివాసగౌడ్, కత్వాల్‌గూడ మాజీ సర్పంచ్

పొలాలు లాక్కుంటే ఊరుకోంఎన్నో ఏళ్లుగా ఇక్కడి రైతులు పొలాలను సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు అవి ఎనిమీ ప్రాపర్టీవి అని వాటిని లాక్కుంటే ఊరుకోం. వాటికోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమవుతాం. – కృష్ణయ్య, కొత్వాల్‌గూడ మాజీ సర్పంచ్

భూములు లాక్కుంటారని భయమవుతుందికొత్వాల్‌గూడకు ఏదో అవుతుందని.. ఇక్కడి రైతుల భూము లు ఎవరో లాక్కుంటారని ప్రచారం సాగుతోంది. దీంతో మాకు భయంగా ఉంది. మా పొలాల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదు. అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం.–ఈశ్వర్, రైతు, కొత్వాల్‌గూడఆత్మహత్య చేసుకుంటాం కొత్వాల్‌గూడలో తాము ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూములు విడిచిపొమ్మంటే ఎలా వెళతాం. వాటిని పోగొట్టుకోవాల్సి వస్తే పక్కనే ఉన్న హిమాయత్ సాగర్ (సౌడమ్మ చెర్వు)లో దూకి ఆత్మహత్య చేసుకుంటాం. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలి. – లక్ష్మి, గృహిణి

# డెంగీ దడ



నాగర్‌కర్నూల్ : డెంగీ దడ పుట్టిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 10 రోజుల్లోనే 30 కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలా కేసులు నమోదవుతుంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో అంతకు రెట్టింపు స్థాయిలో ఉంటున్నాయి. ప్రధానంగా శుభ్రత లోపించడం వల్ల జనం విష జ్వరాల బారిన పడుతున్నారు. అవగాహన కల్పించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి చేయిదాటుతోంది. ఇప్పటికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాల గురించి తెలియకపోవడం గమనార్హం. అక్టోబరు 11: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డెంగీ దడ పుట్టిస్తోంది. కేసులు నమోదవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 48 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నా ఆ లెక్కలను ప్రభుత్వ అధికార యంత్రాంగం పరిగణించడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులనే గుర్తిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నీరు నిల్వ ఉండి, దోమల బెడద పెరిగింది. అవి కుట్టడం వల్ల ప్రజలు డెంగీతో పాటు మలేరియా, చికున్ గున్యా వ్యాధుల బారిన పడుతున్నారు.

లోపించిన పారిశధ్యం: నారాయణపేట జిల్లా కేంద్రంలోని పాత గంజి రోడ్డులో మురుగు నీరు నిలుస్తోంది. సివిల్ లైన్ రోడ్డు విస్తరణ పేరిట తవ్వకాలు జరపడంతో ఏర్పడ్డ గుంతలలో వర్షపు నీరు నిలిచి, మురికి కూపంలా మారాయి. అవి దోమలకు స్థావరాలుగా మారాయి. ఆర్డీవో కార్యాలయంతో పాటు పాత మునిసిపల్ కార్యాలయం ముందు వర్షపు నీరు నిలిచింది. పళ్ల బ్రిడ్జీ దగ్గర చెత్తాచెదారం వేస్తుండడంతో అక్కడ పందులు స్వైర విహారం చేస్తున్నాయి. డ్రై డేను అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగర్‌కర్నూల్‌లో 93 కేసులు

డెంగీ జ్వరాలతో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు సతమతమవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 93 కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. 83 మంది జిల్లాలో ఉండగా, 10 మంది జీవనోపాధి కోసం జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లిన వారు అక్కడ డెంగీ బారిన పడ్డారు. వారి ఆధార్ కార్డు అడ్రస్ జిల్లాకు సంబంధించినది కావడంతో ఆ కేసులు జిల్లాలోనే నమోదు చేశారు. 83 కేసులలో కోడేరు, పెంట్లవెల్లి మండలాల్లో అధి కంగా 45 కేసులు నమోదయ్యాయి. డెంగీ మరణాలు సంభవించలేదని అధికారులు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంకా ఎక్కువ మంది డెంగీ బారిన పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన చికిత్స లభించకపోవడంతో జనం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

నదీ పరివాహక ప్రాంత గ్రామాలపై పంజా

వనపర్తి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 95 డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 2017 నుంచి ఈ ఏడాది వరకు డెంగీ కేసులు పరిశీలిస్తే 2017లో 25 కేసులు నమోదయ్యాయి. 2018లో 24 కేసులు, 2019లో 95, 2020లో 74 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకే 95 కేసులు నమోదు కావడంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ఒక మలేరియా, ఒక చికున్‌గున్యా కేసులు కూడా నమోదయ్యాయి.

దోమ తెరలు పంపిణీ

డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు ఎక్కువగా నదీ పరివాహక ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. తిప్పడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేందం పరిధిలోని గ్రామాల్లో, కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమరచింత మండలాల్లో కేసులు అధిక సంఖ్యలో వస్తున్నాయి. వాటిని కట్టడి చేయడం కోసం మూలమల్ల, నందిమల్ల, జూరాల, మొట్లోంపల్లి, గుంటిపల్లి, బాలకిష్టాపూర్, పాన్‌గల్ పీహెచ్‌సీ పరిధిలోని అన్నారం, పెబ్బేరు మండలంలోని రాంపూరం గ్రామాలతో పాటు ఆత్మకూర్ పట్టణంలో 6,600 దోమ తెరలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు. వీటితో పాటు నిల్వ నీటిలోని దోమ లార్వను అరికట్టడం కోసం పెద్దమందడి, మదనపూర్, పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 7,600 గంబూజియా చేపలను పెంచుతున్నారు.

గద్వాలలో 10 రోజుల్లో 30 కేసులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి ప్రజలు డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. కలుషిత నీరు, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమల స్వైర విహారంతో డెంగీ బారిన పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 270 కేసులు నమోదయ్యాయి. జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 10 రోజుల్లోనే 30 డెంగీ కేసులు నమోదైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు వైరల్ జ్వరాల కేసులు 70–80 వచ్చాయని చెప్పారు. ఇందులో కొన్ని డెంగీ కేసులు కాకున్నా కూడా ప్లెట్‌లెట్స్ తగ్గిపోతున్నాయని అన్నారు. జిల్లా ఆస్పత్రిలోనే రోజూ దాదాపుగా 4–5 డెంగీ కేసులు, 7–8 వైరల్ జ్వరాలు నమోదు అవుతున్నాయని చెప్పారు. ప్రవేట్ ఆస్పత్రుల్లో రోజూ దాదాపు 20 వరకు డెంగీ కేసులు నమోదవుతున్నట్లు సమాచారం. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు, కర్నూల్, హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని డాక్టర్లు చెబుతున్నారు.

జిల్లా కేంద్రంలో పారిశుధ్య పనులు నిల్: జోగుళాంబ గద్వాల పేరుకే జిల్లా కేంద్రం అని చెప్పుకోవాల్సి వస్తోంది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. బస్టాండ్‌తో పాటు పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. పలు కాలనీల్లో పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణ చర్యలు లోపించడంతోనే డెంగీ కేసులు పెరుగుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. డెంగీ ప్రధానంగా దోమల వల్లే వస్తుందని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ చెప్పారు. దోమల నివారణకు మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

# వెలగని దీపాలు

కరీంనగర్ : బతుకమ్మ.. దసరా పండుగల సందర్భంగా వీధుల్లో చీకటి ఉండకుండా, బతుకమ్మ ఆడుకునే మహిళలకు సౌకర్యంగా ఉండేలా నగరపాలక సంస్థ ఏటా ప్రత్యేక వీధిదీపాలు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలుస్తోంది. ఏడాది కూడా 24 పనులకు టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. నగరంలోని 60 డివిజన్లలో ఎంపిక చేసిన స్థలాల్లో, అదేవిధంగా బతుకమ్మ నిమజ్జనం చేసే చెరువులు, కెనాల్స్ దగ్గర ప్రత్యేక వీధిలైట్లు బిగిస్తారు. నగరమంతా కలిపి సుమారు 12,619పైగా లైట్లు బిగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఫ్లడ్ లైట్ల కోసం పెద్ద టవర్లు, మినీ టవర్లు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో జనరేటర్లు కూడా ఆయా ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచారు.

గంపగుత్తగా బిగింపు

నగరంలోని ముఖ్య కూడళ్ల దగ్గర మహిళలు బతుకమ్మ ఆడుకునే పాయింట్‌లో 1000 వాట్స్ గల హాలోజన్ లైట్లు సుమారు 6,335



బిగించారు. ఇందులో డివిజన్లలో మూడు వేల వీధిదీపాలు వెలిగించారు. ఇక్కడి వరకు బాగానే ఉండగా హాలోజన్ లైట్లు ఎలాంటి టెస్టింగ్ లేకుండా గంపగుత్తగా సంబంధిత గుత్తేదారులు తీసుకొచ్చి నగరపాలిక వీధిదీపాల కార్మికులకు అప్పగించారు. ఎన్ని లైట్లు ఉన్నాయో లెక్క లేదు. ఎన్ని వెలుగుతాయో, ఎన్ని రావో తెలియకుండానే ఆ కార్మికులు మంగళవారం, బుధవారం ఉదయం కల్లా లైట్లు తీసుకెళ్లి డివిజన్ కేంద్రాల్లోని బతుకమ్మ పాయింట్స్‌లో మూడు నుంచి నాలుగు లైట్లు బిగించారు. ఒకటెండ్రు చోట్ల సమస్యలు వచ్చినట్లు చెబుతున్న ఇంజినీరింగ్ అధికారులు.. మార్చకుండా వదిలేశారు.

# ఆరుతడి పంటలకు డిమాండ్

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలో ఆరుతడి పంటలకు డిమాండ్ పెరిగింది. ఆరుతడి పంటల విస్తీర్ణం తక్కువగా ఉండటం ధరల పెరుగుదలకు కారణమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆరుతడి పంటల్లో పెసరకు కొంతకాలంగా భారీగా ధర పలుకుతోంది.ఉమ్మడి జిల్లాలో పెసరకు రికార్డుస్థాయి ధర పలుకుతోంది. తక్కువ విస్తీర్ణంలో పెసర సాగు కావడం, దానికితోడు పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు అధికంగా కురవడంతో దిగుబడి తగ్గింది. చేతికి వచ్చిన కొద్ది పంటను మార్కెట్లకు తీసుకెళ్తే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో పెసలకు క్వింటాకు రూ.7,589 రికార్డుస్థాయి ధర పలికింది. కొద్దిరోజులుగా పెసరకు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. పేట మార్కెట్‌లో ఈ–నామ్ విధానం ద్వారా సీక్రెట్ టెండర్ నడుస్తోంది. దీంతో ఒక ఖరీదుదారుడు ఎంతమేర ధర నిర్ణయిస్తున్నారనే విషయం మరో ఖరీదుదారుడికి తెలిసే అవకాశం ఉండదు. దీంతో పోటీతత్వం పెరిగి ధరలు పెరిగాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో పెసలకు మద్దతు ధర రూ.7,459 ఉండగా, కనిష్ఠ ధర రూ.3,129, మోడల్ ధర రూ.5,359గా ఉంది.

పంటల సాగు తగ్గడంతో..

పెసర, కంది, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులకు వ్యవసాయ మార్కెట్లలో అధిక ధరలు వస్తుండటంతో వరి సాగు చేసిన రైతులు నిట్టూరుస్తున్నారు. ఎక్కువ మంది రైతులు వరి సాగుకు మొగ్గుచూపడంతో ఉమ్మడి జిల్లాలో అపరాల సాగు తగ్గింది. ఈ ఏడాది సూర్యాపేట జిల్లాలో పెసర 12,867 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, 4,394 ఎకరాల్లో మాత్రమే సాగైంది. కంది 24,257 ఎకరాలకు, 9,229 ఎకరాల్లో, వేరుశనగను 3,331ఎకరాలకు కేవలం 1009 ఎకరాల్లో మాత్రమే సాగైంది. యాదాద్రి, నల్లగొండ జిల్లాలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. మూడేళ్లుగా, ఉమ్మడి జిల్లాలో అపరాల సాగు తగ్గుతూ వస్తోంది. సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో అపరాలకు బదులు రైతులు వరివైపు మొగ్గుచూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగుచేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నా రైతులు మాత్రం వరిపైనే ఆసక్తి చూపారు. కేవలం కొద్దిమంది రైతులు మాత్రమే ఆరుతడి పంటలు సాగు చేయగా, వాటికి మద్దతు ధరకు మించి వ్యాపారులు చెల్లిస్తున్నారు. వరి పంటకు మాత్రం మార్కెట్లలో మద్దతు ధరకంటే తక్కువ లభిస్తోంది. తాజా పరిస్థితులను గమనించి రైతులు యాసంగిలో ఆరుతడి పంటలు సాగుచేయాలని, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కందులకు మద్దతు ధర క్వింటాకు రూ.6,300 ఉండగా, వ్యాపారులు రూ.6,500 నుంచి రూ.7,000 వరకు చెల్లిస్తున్నారు. పెసరకు మద్దతు ధర రూ.7,275 ఉండగా, రూ.7,000 నుంచి రూ.7,400 వరకు ధర పలుకుతోంది. వేరుశనగకు మద్దతు ధర రూ.5,550 ఉండగా, రూ.6,000 నుంచి రూ.6,500 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు.

ఈ–నామ్‌తోనే అధిక ధరలు : ఎండి.ఫసియుద్దీన్, సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ఈ–నామ్ విధానం అమలవుతుండటంతో అపరాలకు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్ విధానంలో ఒక ఖరీదుదారుడు ఎంత ధర నిర్ణయించాడనే విషయం మరో ఖరీదుదారుడికి తెలియదు. అపరాల దిగుబడి తక్కువ ఉండటం వల్ల వ్యాపారుల మధ్య పోటీపెరగడంతో ఎక్కువ ధరలు పలుకుతున్నాయి.

# సామాజిక ఆరోగ్యకేంద్రం ఉన్నతీకరణకు మోక్షమెప్పుడో?

జనగామ : పాలకుర్తిలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరణ కలగానే మిగిలింది. దీంతో మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. ఏడాది కిత్రం ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వచ్చినా.. వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి.

రోగుల ఇబ్బందులుఈ ఆసుపత్రి 1977లో 30 పడకల ఆసుపత్రిగా మారింది. ఆ తర్వాత ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా స్థాయిని పెంచారు. అనంతరం సామాజిక వైద్యశాలగా కొనసాగుతోంది. దీని ప్రాంగణంలో మూడేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షలతో పోస్టుమార్టం గదిని నిర్మించారు. దాన్ని ఇంతవరకూ ప్రారంభించలేదు. ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చి మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రికి నిత్యం చికిత్స కోసం సుమారు 120 మంది వరకు బయటి రోగులు వస్తుంటారు. రోజు సుమారు 200 మంది వస్తారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది, మందులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రజలు వరంగల్, హైదరాబాద్, జనగామ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. వైద్యానికి రూ.లక్షలు వెచ్చిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. వైద్యశాలను 100 పడకలుగా మార్చి 24 గంటలు వైద్య సేవలందించాల్సిన అవసరం ఉంది.

అందని ద్రాక్షగానే అత్యవసర వైద్యం..

ఆసుపత్రిలో రోగులకు అత్యవసర వైద్యం అందని ద్రాక్షగానే మారింది.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందడం లేదు. ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచిస్తుంటారు. మిగతా రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందవు. వైద్యశాలలో 8 మంది వైద్యులుండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారు. కొన్నేళ్లుగా వైద్యుల పోస్టులను భర్తీ చేయడం లేదు. వైద్యులు స్థానికంగా ఉండకపోవడంతో రాత్రివేళల్లో వైద్య సేవలందడం లేదు. జనరల్ సర్జన్, ఫిజీషియన్, అనస్తీషియా, పిల్లల వైద్యనిపుణులు, గైనకాలజిస్టులను నియమించి మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి– రమాదేవి, పాలకుర్తి

30 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేయాలి. ఆధునిక పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి. పాలకుర్తి దినదినాభివృద్ధి చెందుతున్నందున ఇక్కడ పెద్దాసుపత్రి ఉండాల్సిందే. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

ప్రతిపాదనలు పంపించాం..– వైద్యాధికారి పాలకుర్తి ఆసుపత్రిని 100 పడకల వైద్యశాల ఆసుపత్రిగా మార్చాలని ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆసుపత్రిలో వైద్యుల కొరతపై ప్రభుత్వం యోచిస్తోంది. త్వరలో సిబ్బంది ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తారని ఆశిస్తున్నా. ఆసుపత్రిలో నూతన బీపీ పరికరంతో పాటు గర్భిణులకు స్కానింగ్ యంత్రాన్ని అందుబా టులోకి తెచ్చాం. రక్తపరీక్షల యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

# ఉపాధిలో భేష్

భూపాలపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత లక్ష్యానికంటే అధికంగా పనులు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా 5వ స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రజలకు పనులు కల్పించడమే కాకుండా అన్నదాతలకు, గ్రామాల అభివృద్ధికి పలు పనులు చేపట్టడంలో ఉపాధి హామీ పథకం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. సొంత గ్రామంలోనే పనులు చేసుకుంటూ ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటుండంతో పనులను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు.

వంద శాతం మించి..

జిల్లాలోని 241 పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు 27.38 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేసుకున్నారు. 2023 మార్చి 31వ తేదీ నాటికి లక్ష్యం కంటే అధికంగా 30.28 లక్షల పని దినాలు(118 శాతం) పనులు పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 5వ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పనుల నిర్వహణకు సంబంధించి వెంటవెంటనే పనులకు అనుమతులివ్వడంతో లక్ష్యం పూర్తి చేయడం తేలికైందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి లక్ష్యానికి మించి కూలీలకు పనులు కల్పించడం ఇదే మొదటిసారని అధికారులు తెలుపుతున్నారు. పనులకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది మూడు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సకాలంలో ఇది జరిగేలా, వెనుకబడి మండలాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి లక్ష్యం పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నారు.

కూలీ చెల్లింపుల్లో 6వ స్థానం

కూలీలకు నగదు చెల్లింపుల్లోనూ జిల్లా ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు కూలీ సగటున రూ.150 నుంచి రూ. 164.4 వరకు అందిస్తే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఒకరోజు కూలీ సగటున రూ.186.50 చెల్లించారు. అలాగే ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.56.50 కోట్లు చెల్లింపు చేశారు. ఇంకా సుమారు రూ.2 కోట్ల చెల్లింపులు చేపట్టాల్సి ఉందని.. రెండు మూడు రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.08 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 2.39 లక్షల మంది కూలీలుగా నమోదు చేసుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.17 లక్షల మంది ఉపాధి పనులను సద్వినియోగం చేసుకున్నారు. 773 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అత్యధికంగా భూపాలపల్లి, కాటారం, మహాదేవ్‌పూర్, రేగొండ మండలాల్లో వందరోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు ఉండగా అత్యల్పంగా టేకుమట్ల, మల్హర్‌రావు, పలిమెల మండలాల్లో ఉన్నారు.

# ‘ఆరోగ్య మహిళ’కు ఆదరణ



వరంగల్ : స్త్రీల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభించిన ‘ఆరోగ్య మహిళ’ సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా 100 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి 8 రకాల వైద్యసేవలను మహిళలకు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో గత నాలుగు వారాలలో 697 మంది మహిళలు ఆరోగ్య మహిళ సేవలు పొందగా, 52 మందిని మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం, సీకేఎం, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ జీఎంహెచ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. హనుమకొండకు చెందిన ఓ 18 సంవత్సరాల విద్యార్థినికి ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద ఎంజీఎం వైద్యులు కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా సాధ్యం కాని శస్త్రచికిత్సను నిర్వహించి బతికించారు.

గుర్తించిన సమస్యలు

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ సంతానలేమి థైరాయిడ్ మధుమేహం రక్తపోటు రక్తహీనత మోనోపాజ్ బరువు

8 రకాల పరీక్షలు

1. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు
2. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్
3. థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డీ పరీక్షలు
4. మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్ష
5. మోనోపాజ్ దశకు సంబంధించిన పరీక్షలు హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ, కౌన్సెలింగ్
6. నెలసరి, సంతాన సమస్యలపై పరీక్షలు అవగాహన అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు
7. శారీరక కలయిక సంబంధిత అంటు వ్యాధుల పరీక్షలు, వైద్యం
8. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన

కార్పొరేట్ ఆసుపత్రుల్లో కానిది ఎంజీఎంలో చేశారు

– సన్నూరి పూజిత, దీన్‌దయాళ్‌నగర్, హనుమకొండ

మాది హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీన్‌దయాళ్‌నగర్. అమ్మానాన్నలు కూలి పని చేస్తారు. నేను సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. పుట్టుకతో తల మెదడు భాగంలో ఏర్పడిన చిన్నగడ్డ నేను పెరిగేకొద్దీ పెద్దదైంది. నాన యాకయ్య అన్ని ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి చూపించారు. శస్త్రచికిత్స చేస్తే మీ బిడ్డ బతకదని చెప్పడంతో తాత్కాలిక మందులతో కాలం గడుపుతునన్నా. మార్చి 8న మహిళా దినోత్సవం వేళ న్యూశాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభంలో పెద్ద డాక్టర్లు వస్తున్నారని నాన్న నన్ను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను కలిసి తమ బాధ చెప్పుకున్నాం. ఆయన స్పందించి ఎలాగైనా నయం చేయాలని వైద్యులకు సూచించి ఎంజీఎంకు పంపించారు. మార్చి 15న వైద్యులు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. మందులిచ్చి శనివారం డిశ్చార్జి చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ఎంజీఎం వైద్యులు శస్త్రచికిత్స చేయడం నాకు ఆనందంగా ఉంది. ఎంజీఎం వైద్యులకు, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు రుణపడి ఉంటాను.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

– డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, వరంగల్

‘ఆరోగ్య మహిళ’ పథకంలో వైద్యసేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఆయా కేంద్రాలలో గుర్తించిన వారికి అవసరమైతే మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. జీవితాంతం సంతోషంగా జీవించేందుకు మహిళలు తప్పనసరిగా ఆరోగ్య మహిళ సేవలను పొందాలి.

# చిరు వ్యాపారుల చిరునామా ఎక్కడ



వరంగల్ : చిరు వ్యాపారులకు శాశ్వత చిరునామా చూపించడంలో నగర పురపాలక సంస్థలు వెనకబడ్డాయి. వీధి వ్యాపారుల విక్రయ కేంద్రాలు(హాకర్స్ జోన్లు) ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నగరంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో సుమారు ఐదు వేల మంది వీధి వ్యాపారులుంటారు. ప్రధాన, అంతర్గత రహదారులు, కూడళ్లు, రైల్వే, బస్ స్టేషన్ల వద్ద బిక్కు బిక్కుమంటూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. నిత్యం ట్రాఫిక్ పోలీసులు, గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరానికి ఎవరైనా వీఐపీలు వస్తే దుకాణాలు మూసేయిస్తున్నారు. శాశ్వత చిరునామా లేక పరేషానవుతున్నారు. నగరంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా శాశ్వత పరిష్కారం చూపాలని పలుమార్లు వీధి వ్యాపారుల ప్రతినిధులు విన్నవించినా అధికారుల్లో చలనం లేదు.

ఐదు వేల మంది ఉన్నా.. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో సుమారు ఐదు వేల మంది చిరు వ్యాపారులుంటారు. వీరికి శాశ్వత చిరునామా చూపించేందుకు గ్రేటర్ వరంగల్ దృష్టి సారించింది. టౌన్‌ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయిలో సర్వే చేసింది. 61 ప్రాంతాలు గుర్తించారు. 31 ప్రాంతాల్లో గ్రీన్ జోన్(వీధి విక్రయ కేంద్రాలు), 14 అంబర్ జోన్లు(సమయానికి అనుగుణంగా వ్యాపారాలు), 14 రెడ్ జోన్లు(వీధి వ్యాపారాల నిషేధం) ఎంపిక చేశారు. 17 ప్రాంతాల్లో చిరు వ్యాపారుల కోసం హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉండగా 11 పూర్తి చేశారు. కేవలం 517 మందికి దుకాణాలు కేటాయించారు. కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో 11 వీధి విక్రయ కేంద్రాలు ప్రారంభించారు. 517 మంది చిరు వ్యాపారులకు షెడ్లు కేటాయించారు. కాజీపేట బాపూజీనగర్‌లో కూరగాయలు, పండ్లు విక్రయ కేంద్రాల్లో వ్యాపారులున్నారు. లి హనుమకొండ కుమార్‌పల్లి కూరగాయల మార్కెటు, మాంసం మార్కెట్లో వినియోగంలో ఉన్నాయి. సుబేదారి పోలీసు స్టేషన్ పక్కనే వినియోగంలో ఉంది. టీటీడీ కల్యాణ మండపం నుంచి జిల్లా గ్రంథాలయం వరకు, ఎల్బీ ప్రాక్టీసింగ్ హైస్కూల్ నుంచి డైట్ కళాశాల వరకు, ఎస్ఈ ఇరిగేషన్ కార్యాలయం నుంచి ఐబీ ప్రహరీ వరకు, బీఈడీ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వెనకాల షెడ్లు చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. హనుమకొండ చౌరస్తా, విజయటాకీస్ రోడ్, టైలర్‌స్ట్రీటు, ఏనుగులగడ్డ, కొత్త బస్టాండ్, అలంకార్, అదాలత్, నయీంనగర్, కేయూసీ జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ, బాలసముద్రం ఏకశిలా పార్కు తదితర ప్రాంతాల్లో రహదారుల్లోనే చిరు వ్యాపారాలు నడుస్తున్నాయి. వరంగల్ ప్రాంతంలో సుమారు 2–3 వేల మంది చిరు వ్యాపారులుంటారు. ఇంతవరకు ఒక్క వీధి విక్రయ కేంద్రం ఏర్పాటు కాలేదు. ఐదారేళ్ల క్రితం వరంగల్ అండర్ బ్రిడ్జి పక్కనే రైల్వే ట్రాక్ పక్కన షెడ్లు కడుతుంటే అభ్యంతరాలు వచ్చాయి. వరంగల్ స్టేషన్ పార్కు, పోచమ్మ మైదాన్, ఎంజీఎం ఆసుపత్రి, రాంకీ వద్ద స్థలాలు ఎంపిక చేశారు. ఇంతవరకు అడుగులు పడలేదు. లి గోపాలస్వామి గుడి, పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ, వరంగల్ రైల్వే, బస్ స్టేషన్లు, వరంగల్ ప్రధాన తంతి తపాలా కేంద్రం, అండర్‌బ్రిడ్జి, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్, పాత చౌరస్తా, బట్టల బజారు, పాపయ్యపేట చమన్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పైనే చిరు వ్యాపారాలు సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

స్థలాల కోసం సర్వే: రమేష్, టీఎంసీ, మెప్మా

కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో వీధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాల ఎంపిక సర్వే నడుస్తోంది. ఇప్పటి వరకు 11 ప్రాంతాల్లో పూర్తయ్యాయి. 517 మందికి దుకాణాలు కేటాయించాం. వరంగల్‌లో స్థలాలు లభిస్తే వెంటనే పనులు మొదలవుతాయి.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు నర్సంపేట : వీధి వ్యాపారుల కోసం నర్సంపేట పురపాలిక అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి 2021 ఫిబ్రవరిలో అంగడి మైదానంలో వ్యాపార మడిగలు నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెప్మా సిబ్బంది గుర్తించిన వీధి వ్యాపారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కూరగాయలు, పండ్లు, పూలు, కుండలు, ప్లంబర్, జనరల్ సామాను, చిల్లర కొట్టు, ప్లాస్టిక్ సామాను వంటి వివిధ వ్యాపారాలు చేసే వీరు దుకాణాలు నిర్వహణకు సొంత అడ్డాల్లేక నానా కష్టాలు పడుతున్నారు. వీరికి చేయూతనిచ్చేందుకు నర్సంపేటలో పట్టణ ప్రగతి పథకంలో రూ.7 లక్షలతో 15 షెడ్లు నిర్మించారు. పుర అధికారులు కూరగాయల మార్కెట్(రైతు బజారు)స్థలంలో పక్కాగా నిర్మించారు. 2021 ఫిబవరిలో షెడ్లను ప్రారంభిస్తామని చెప్పిన అధికారులు అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయారు. ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మల్లా వెక్కిరిస్తున్నాయి. ఈ షెడ్లలోకి వచ్చేందుకు వీధి వ్యాపారులు సుముఖత చూపడం లేదు. ఇక్కడ దుకాణాలు పెడితే బేరాలు సాగవని చెప్పి ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కట్టించిన షెడ్లు వీధి వ్యాపారులకు ఉపయోగపడక పోగా ..నిర్మాణంతో పుర ఖజానాకు చిల్లి పడింది.నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణం వర్ధన్నపేట : వర్ధన్నపేటలో చిరు వ్యాపారులకు ఉపయోగపడేలా నిర్మించ దలిచిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన సముదాయ పనులు రెండు సంవత్సరాలుగా పునాదులకే పరిమితమయ్యాయి. పనులునత్తనడకన సాగుతుండడంపై ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్వయంగా గుత్తేదారునిపై, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా వేగంగా జరగడం లేదు. సుమారు వంద మంది వరకు చిరు వ్యాపారులు ఉండగా జాతీయ రహదారి పక్కన అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

# వినియోగం లేనట్లేనా?

భూపాలపల్లి : ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మించినా వినియోగించుకోవడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఎండలకు, వానలకు తట్టుకొనేలా పట్టణ ప్రగతి నిధులు రూ.14.59 లక్షలతో సుభాష్‌కాలనీ సమీపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన 28 రేకుల షెడ్లు నిర్మించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ ఏడాది ఫిబ్రవరి 23న ప్రారంభించారు. ఒక రోజు ముందుగానే వీధి వ్యాపారులకు డ్రా పద్ధతిన కేటాయించారు. మంత్రి ప్రారంభించిన కొద్దిసేపు మాత్రమే వీధి వ్యాపారులు ఆ షెడ్లలో అమ్మకాలు సాగించారు. మళ్లీ పాత ప్రాంతాల్లో రోడ్ల పక్కనే అమ్మకాలు చేపడుతున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలి..

వీధి వ్యాపారుల కోసం ప్రభుత్వం నిర్మించే రేకుల షెడ్లను రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్మించిన షెడ్లు అంబేద్కర్ కూడలి ప్రాంతం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల



పక్కన సుమారు 600 మీటర్ల దూరంలో ఉండటంతో అందులో అమ్మకాలు కొనసాగవని ముందుకు రావడం లేదు. అంబేద్కర్ కూడలి ప్రాంతంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయం ముందు భాగంలో, గణేష్ చౌక్ ప్రాంతంలో అటవీ శాఖ కాంప్లెక్స్ ముందు, సింగరేణి ఏరియా వర్క్ షాపు ముందు భాగంలో రేకుల షెడ్లు నిర్మిస్తే వీధి వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని పలువురు వ్యాపారులు తెలిపారు.

తప్పని ట్రాఫిక్ సమస్య

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి, గణేష్ చౌక్, సింగరేణి వర్క్ షాపు ఏరియా ప్రాంతాల్లో రోడ్ల పక్కన తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు, పూల అమ్మకాలు కొనసాగుతున్నాయి. రోడ్ల పైనే అమ్మకాలు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పలు సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అంబేద్కర్ కూడలి ప్రాంతంలో కొద్ది నెలల క్రితం లారీ ఢీకొని కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు, పాలకులు ట్రాఫిక్ సమస్యను సరిదిద్దడానికి తాత్కాలికంగా నిర్ణయాలు తీసుకుని, ఆ తర్వాత వదిలేస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలి– లలిత, చిరు వ్యాపారి

ప్రభుత్వం నిర్మించిన రేకుల షెడ్లు దూరంగా ఉండటంతో అందులో అమ్మకాలు కొనసాగవనే నమ్మకంతో చిరు వ్యాపారులు అందులోకి వెళ్లడం లేదు. అమ్మకాలు జరిగే ప్రాంతంలోనే షెడ్లు నిర్మించాలి. వారు ఎక్కడ ఖాళీ స్థలం అనుకూలంగా ఉంటే అక్కడ నిర్మించారు. అందులోకి వెళ్తే అమ్మకాలు ఉండవు. షెడ్లలో మాంసం, చికెన్ సెంటర్లకు కేటాయిస్తే బాగుంటుంది.

చిరు వ్యాపారులకు నష్టం చేయవద్దు– అంబాల చంద్రమౌళి, కాకతీయ ఫ్రూట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జనాల రద్దీ, ప్రయాణికులు ఎక్కువగా బస్సుల కోసం వేచి చూసే ప్రదేశాల్లోనే పండ్లు, పూలు తదితర చిరు వ్యాపారాలు ఎక్కువగా కొనసాగుతాయి. పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు నిర్మించిన 28 రేకుల షెడ్లు జనాలు ఎక్కువగా సంచరించని ప్రాంతంలో ఉండటంతో అందులోకి వెళ్లడానికి చిరు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంతాల్లోనే అమ్మకాలు చేపట్టేందుకు వారికి అనుమతులివ్వాలి.త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం– రాజేశ్వరి, మెప్మా పీడీ15 రోజుల క్రితం డ్రా పద్ధతిన రేకుల షెడ్లు కేటాయించిన చిరు వ్యాపారులతో త్వరలోనే మున్సిపల్ కమిషనర్, ఛైర్ పర్సన్ సమక్షంలో సమావేశాన్ని నిర్వహిస్తాం. వారికి మరి కొద్ది రోజుల సమయాన్ని కేటాయించి, డిమాండ్లను పరిగణలోకి తీసుకుని, జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు వారికి కేటాయించిన షెడ్లలోకి పంపించడానికి చర్యలు తీసుకుంటాం.

# నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి!

కరీంనగర్ : అంబేద్కర్ స్టేడియం ఎదురుగా రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న వారికి బస్టాండ్ వెనుకాల ఉన్న షెడ్డులో కేటాయించారు. కొన్ని రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఇక్కడే విక్రయించారు. కొనుగోలుదారులు రాకపోవడంతో చిరు వ్యాపారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.రెండేళ్ల కిందట కరోనా రావడం.. లాక్‌డౌన్ విధించడం.. వ్యక్తిగత దూరం పాటించేందుకు వీలుగా డివిజన్ల వారీగా ఎక్కడ పడితే అక్కడ కూరగాయలు అమ్ముకోవడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. అక్కడే విక్రయించేలా పర్యవేక్షణ చేశారు. సాధారణ పరిస్థితి వచ్చాక కొన్ని చోట్ల నుంచి దుకాణాలు తొలగించగా.. రహదారులపై మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. వీటిని తొలగించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన షెడ్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నా.. మున్నాళ్ల ముచ్చటగా తయారైంది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా శివారు కాలనీలు విస్తరిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనేందుకు ఒకటెండ్రు ప్రాంతాలకే రాకుండా రద్దీని తగ్గించేందుకు, ఎక్కడి వారిని అక్కడే కొనేందుకు, చిరు వ్యాపారులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు వీలుగా పలు ప్రాంతాల్లో చిన్న మార్కెట్లు నిర్మించారు. ఖాళీ స్థలాలు, రద్దీ సమయాల్లో రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపైనే అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరందరికి ఒక్కో చోట రూ.17 లక్షలకు తగ్గకుండా ఖర్చు చేసి నిర్మించగా అవన్నీ ఖాళీగా ఉన్నాయి.

మార్కెట్లకు రాని వ్యాపారులు.. హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించగా సుమారు 60 మందికి తగ్గకుండా కూర్చోనేందుకు గద్దెలు నిర్మించారు. ఇక్కడికి పాతబజారు ప్రాంతంలోని వారికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. బస్టాండ్ వెనుకాల వెండింగ్ జోన్‌ను రూ.17 లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. పండ్ల వ్యాపారులకు కేటాయించగా ప్రస్తుతం కమ్మరి వృత్తి చేసే వారికి కేటాయించగా మిగతా భాగం ఖాళీగా ఉంది. కొన్ని రోజులు అంబేద్కర్ స్టేడియం ఎదురుగా కూర్చోనే వారికి కేటాయించారు. ఇందిరానగర్ మార్కెట్‌ను రూ.30 లక్షలతో నిర్మించగా 60 మంది వ్యాపారులకు సౌకర్యాలు కల్పించారు. అందులో ఉదయం పూట పది మంది వ్యాపారులు మాత్రమే వచ్చి విక్రయిస్తున్నారు. చైతన్యపురి మార్కెట్‌లో సుమారు 45 మంది అమ్ముకునేలా నిర్మించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల వైపు విక్రయించే వారికి కేటాయించగా అందులో సగం మంది వస్తున్నారు. మిగతా వారంతా రోడ్ల మీద అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా సుమారు 60 మంది కూర్చునే విధంగా తీర్చిదిద్దారు. ఇందుల్లోకి టెలిఫోన్ క్వార్టర్స్ వైపు రోడ్ల మీద ఉన్న వారికి కేటాయించాలని నిర్ణయించారు. కశ్మీర్‌గడ్డ రైతుబజారును సమీకృత మార్కెట్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. టెండర్ పూర్తి కాగా రూ.30 లక్షలతో తాత్కాలికంగా షెడ్లు నిర్మించారు. మొత్తం 122 మందికి అవకాశం కల్పించనున్నారు. విద్యానగర్‌లోని ట్యాంకు సమీపంలో వెండింగ్ జోన్ పూర్తయింది. ఇందులో ఆ ప్రాంతంలో రోడ్ల మీదనే ఉండే వారికి అవకాశం ఇస్తారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించిన షెడ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

# బాంబులు వేస్తే మేమెలా బతికేది..!

కొత్తగూడెం : సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు పోలీసుస్టేషన్ పరిధిలో దక్షిణ బస్తర్ ప్రాంతంలోని భట్టిగూడ, కావురుగట్ట, మీనగట్ట, జబ్బగట్ట అటవీ ప్రాంతల్లో ఈనెల 7న జరిగిన డ్రోన్ల దాడిని ఖండిస్తూ మావోయిస్టు పార్టీ దక్షిణ్ సబ్‌జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాలను ఆదివారం ఛత్తీస్‌గఢ్ మీడియా సందర్శించింది. ఈ సందర్భంగా అక్కడి దాడులను ఆదివాసీలు వివరించారు. ఆకాశం నుంచి బాంబులు వేస్తే తామెలా బతికేదంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. విప్పపువ్వు సేకరణకు వెళ్తే పైనుంచి డ్రోన్లతో బాంబులు పడ్డాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో కొందరికి గాయాలైనట్లు తెలిపారు. జబ్బగట్ట ఆదివాసీలు డ్రోన్ల దాడిని మీడియా ముందు వివరించారు. హెలికాప్టర్ల నుంచి సైతం కాల్పులు



జరిపారని ఆదివాసీలు ఆరోపించారు. తాము సమీప గుహల్లో దాక్కొని ప్రాణాలు రక్షించుకున్నామని తెలిపారు. అడవినే నమ్ముకొని బతికే తమపై డ్రోన్లతో బాంబులు వేయడం తగునా..? అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆదివాసీలు ఆవేదన, నిరసన వ్యక్తం చేశారు. దాదాపు 20 బాంబులు పడినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల అనంతరం సుక్మా-బీజాపూర్ సరిహద్దు గ్రామాలల్లోని ఆదివాసీలు భీతిల్లుతున్నారు. నీ మవోయిస్టు పార్టీపై కొన్ని రోజుల కిందట కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగానే ఈ వైమానిక దాడులు జరిగాయని మరోపక్క మావోయిస్టు పార్టీ ఆరోపించింది.

# దుకాణాలకు ప్రతిపాదన.. వ్యాపారుల నిరీక్షణ

జనగామ : జనగామ పట్టణంలో చిరు వ్యాపారులకు స్థిర దుకాణాలు, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరంతా రోజు వారి వివిధ పనులు చేసే కార్మికులుగానే గుర్తింపు పొందారు. వీరి ఇబ్బందులను గుర్తించి 2014లో వీధి వ్యాపారం నియంత్రణ, వ్యాపారుల సంక్షేమం కోసం చట్టాన్ని రూపొందించారు. వీధి వ్యాపారం రాజ్యాంగ బద్ధమైన హక్కుగా నిర్ధారించారు. పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా వీధి వ్యాపారుల సంక్షేమానికి, వ్యాపార నియంత్రణకు పురపాలక శాఖ జారీ చేసిన ఆదేశాలు అమలు కావడం లేదు.

నమోదు.. గుర్తింపు కార్డుల జారీ

కరోనాతో కుదేలైన చిరు వ్యాపారులను ప్రధాన మంత్రి ఆత్మనిర్భర్ పథకం ద్వారా ఆదుకునేందుకు ప్రత్యేక రుణ పథకాన్ని అమలు చేశారు. వీధి వ్యాపారుల వివరాలను నమోదు చేసి గుర్తింపు కార్డులు అందజేశారు. రూ.10 వేలు, 20 వేలు, 50 వేల రుణ వితరణ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రోత్సహించడంలేదు.

ఇరువర్గాలకూ ఇబ్బందులే..

జనగామ పట్టణంలో రైల్వేస్టేషన్ నుంచి బస్టాండుకు వెళ్లే మార్గం ప్రధాన వ్యాపార ప్రాంతం. ఈ రోడ్డు వెంట కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక వ్యాపార కూడళ్లు ఉన్నాయి. ఇక్కడ వీధి వ్యాపారం జరుగుతోంది. తోపుడు బండ్లమీద, కూడళ్ల వద్ద పండ్లు, కూరగాయలు, పాతవస్త్రాలు, తినుబండారాల విక్రయాలు, తోపుడు బండ్లమీద, వాహనాలపై ఉపాహార అమ్మకాలు జరుగుతున్నాయి. 60, 100 అడుగుల రహదారుల వెంట అమ్మకాలతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కూడళ్లలో, వీధి మలుపుల్లో, దుకాణాలు, కాలిబాటల ఆక్రమణలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు, మున్సిపల్ విభాగాలపై విమర్శలు వచ్చినప్పుడు వ్యాపారులను అదుపు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల దుకాణదారులే రోజువారీ అద్దె వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి.



అవగాహన కరవు

పట్టణంలో వీధి వ్యాపార నిర్వహణ, నియంత్రణలో భాగంగా ఎరుపు (2), ఆకుపచ్చ(7) అంబర్(1) మొత్తం పది జోన్లను గుర్తించారు. కానీ ఏ జోన్ ఎక్కడ అనేది ప్రకటించలేదు. ఎరుపు రంగు జోన్‌లో వ్యాపారం ప్రమాదకరం. సంతలాంటివి జరిగే చోటును అంబర్‌జోన్ అంటారు. ఆకుపచ్చ జోన్ ఇబ్బందులు లేనిది. జోన్ల విభజనపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన లేదు.

రెండేళ్ల క్రితం ప్రతిపాదన

హనుమకొండ రోడ్డులో ఆర్టీసీ ప్రహరీని ఆనుకొని పెట్రోలు బంకు వరకు వీధి వ్యాపారుల కోసం షెడ్లు ఏర్పాటు చేసేందుకు రూ.4 లక్షలు మంజూరయ్యాయి. పట్టణ ప్రగతి నుంచి మరో రూ.4 లక్షలు కలిపి వ్యాపార సముదాయం(షెడ్లను) నిర్మించాలని 2021 మే నెలలో తీర్మానం చేశారు. అమలు చేసినా అవసరం తీరదని, ప్రతిపాదనను పక్కన పెట్టారు. ఆదర్శమార్కెట్‌ను నిర్మించిన తర్వాత రోడ్లపై సాగుతున్న కూరగాయలు, మాంసం, పూలు, పండ్ల వ్యాపారాలను తరలిస్తామంటున్నారు. వీధి వ్యాపారుల ఇబ్బందులు, వారి వల్ల ఏర్పడే ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు లేవు. పట్టణ స్థాయిలో 11 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేయలేదు.

పట్టణ జనాభా-71357

గుర్తింపు పొందిన వీధి వ్యాపారులు-4952

పురుషులు-898

మహిళలు-4054

స్థలాభావమే సమస్య

- హర్షవర్ధన్, మెప్మా పీడీ, జనగామ

జనగామ పట్టణంలో వీధి వ్యాపారుల గుర్తింపు, రుణ వితరణ పథకం అమలవుతోంది. జోన్లను గుర్తించాం. వెండింగు జోన్లలో వ్యాపార మడిగల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గుర్తించిన ప్రాంతంలో తగినంత స్థలం లేదు. ఉన్నతాధికారులు, కౌన్సిల్ బాధ్యులకు వివరించి ముందుకు వెళ్తాము.

# అగ్గి రాజుకుంటే అంతే..



కొత్తగూడెం : ప్రమాదాలు సంభవించినప్పుడు నష్ట నివారణ తగ్గించడంలో అగ్నిమాపక శాఖాధికారులు కీలకపాత్ర పోషిస్తారు. వేసవిలో ఉమ్మడి జిల్లాలో ఏటా ప్రమాదాలు సంఖ్య ఎక్కువ అవుతోంది. ప్రాణనష్టం తక్కువే అయినా ఆస్తి నష్టం మాత్రం రూ.కోట్లలో ఉంటోంది. ఇందుక్కారణంగా భవన నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చేపట్టడం, అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించకపోవడం, చిన్నపాటి నిర్లక్ష్యాలు నిలుస్తున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. విద్యుదాఘాతం, మానవ తప్పిదాలతోనూ పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ సీజన్‌లోనైనా పరిశ్రమలు, నివాసాల్లో తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలి.

ఖాళీలపై దృష్టి ఏదీ?

ఉమ్మడి ఖమ్మంలోని అగ్నిమాపక కేంద్రాల్లో ఫైర్‌మెన్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే ప్రమాదాల వేళ నష్టనివారణకు వీలుకలుగుతుంది. కొత్తగూడెం 4, ఇల్లెందు 5, భద్రాచలం 3, అశ్వారావుపేట 3, మణుగూరు 2, మధిర 4, ఖమ్మం 11, సత్తుపల్లి అగ్నిమాపక కేంద్రంలో నాలుగు పోస్టులు భర్తీ చేయాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

వంట పూర్తయ్యాక సిలిండర్ రెగ్యులేటర్ కట్టేయాలి. రాత్రంతా లీకేజీ అయినట్లు గుర్తిస్తే లైట్లు వేయకుండా సిలిండర్ బయటకు సుకురావాలి. తడిసిన గోనె సంచిని కప్పిఉంచాలి. గ్రామాల్లో తాగిన బీడీలు, సిగరెట్టు పీకలు ఆర్పేయకుండా పడేయొద్దు. పట్టణాల్లో కొత్త నివాసాలు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణాల సమయంలో సెట్‌బ్యాక్, అగ్నిమాపక నివారణ ఏర్పాటు విషయంపై అధికారులు పర్యవేక్షణ చేపట్టడం లేదు. ఏదైనా జరగరాని ఘటన జరిగితే తీరని నష్టం వాటిల్లుతోంది. ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో జాగ్రత్తలు పాటించాలి. ప్లాస్టిక్ కరిగించే సమయంలో లోపం ఏర్పడితే ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడతాయి. ప్రమాదం సంభవిస్తే నియంత్రించేందుకు ఉపకరణాలు అందుబాటులో ఉంచాలి. కర్మాగారాలు, దుకాణాల్లో ఆయిల్, ప్లాస్టిక్ కారణంగా మంటలు ఎగిసిపడే ప్రమాదముంది. వీటి నియంత్రణకు రసాయన నురుగు వెదజల్లే ఉపకరణాలను ఎక్కువ సంఖ్యలో ఉంచుకోవాలి. పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో షార్ట్‌సర్క్యూట్‌కు తావులేకుండా నాణ్యమైన పరికరాలు, తీగలు వాడాలి.

# లక్ష్యం నాటుకుంది



ఖమ్మం: రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఖమ్మం, భద్రాద్రికొత్త గూడెం జిల్లాలు దన్నుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ రాయితీలు, బిందు సేద్యం పరికరాలు అందించడంలో అధికార యంత్రాంగం చూపిన చొరవతో పంట సాగులో ఉభయ జిల్లాలు దూసుకెళ్తున్నాయి. రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణం క్రమేణా 20 లక్షల ఎకరాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 2022-23 నుంచి ఏటా సుమారు 2 లక్షల ఎకరాల విస్తీర్ణం అదనంగా పెంచేలా సర్కారు లక్ష్యం నిర్దేశించుకుంది. గతంలో ఉన్న రాయితీ విధానాల్లో మార్పులు చేసింది. రైతులు పామాయిల్ సాగు వైపు మొగ్గుచూపేలా రాష్ట్ర ఉద్యాన శాఖ కసరత్తు చేసి జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. ఈ క్రమంలో ఉభయ జిల్లాలు లక్ష్యాన్ని మించి ఫలితాలు సాధించాయి.

ఎలా సాధ్యమైంది? ఉభయ జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, అనుదీప్.. ప్రత్యేక దృష్టి సారించి లక్ష్య సాధనకు ఉద్యాన శాఖ అధికారులను పరుగులు పెట్టించారు.

పంట సాగుకు అనుకూల వాతావరణంతోపాటు మార్కెటింగ్‌కు సమీపంలోనే అశ్వారావుపేట, దమ్మపేటలో సంబంధిత కర్మాగారాలుండటం.

భారీ ఎగుడు దిగుడులకు లోనుకాకుండా ఆయిల్‌పామ్ ధరలు స్థిరంగా ఉంటాయన్న విశ్వాసాన్ని రైతుల్లో కలిగించటం.

ఎస్సీ, ఎస్టీలకు 100శాతం, బీసీలకు 90శాతం రాయితీపై పామాయిల్ మొక్కలు, బిందుసేద్యం పరికరాలు అందించడం.


జిల్లాలో మొత్తమ్మీద 12,533 మంది రైతులు 55,301 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 100 శాతం లక్ష్యం సాధించిన జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి, నాగర్‌కర్నూలు, హన్మకొండ, కామారెడ్డి ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా జిల్లాలో ఒక్క ఏడాదిలోనే 11,551 ఎకరాల్లో పామాయిల్ సాగవటం ఇదే తొలిసారి. మార్చి ఆఖరు నాటికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోగలిగాం. కలెక్టర్ గౌతమ్ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. అనసూయ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఖమ్మం

# అధిక ధర చూపి.. తక్కువకు కొని!

వరంగల్ : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీజన్ ప్రారంభం నుంచి మిర్చి రకాలకు గరిష్ఠ ధరలు పలుకుతున్నాయి. ఈ ధరలను చూసి ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు ఎనుమాముల మార్కెట్‌కు మిర్చిని తీసుకొస్తున్నారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన వ్యవసాయ ఉత్పత్తుల బస్తాలను మిర్చి రకాలకు అనుగుణంగా లాట్స్‌గా విభజించి తొలుత సరకు నాణ్యతను పరీక్షిస్తారు. నాణ్యత కలిగిన పంట ఉత్పత్తులకు అధికారుల సమక్షంలో వ్యాపారులు వేలం ద్వారా ధర నిర్ణయిస్తారు. ఎక్కువ ధర పలికిన వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా మార్కెట్‌లోని మిగిలిన సరకును కొనుగోలుచేస్తారు. అయితే గరిష్ఠ ధరను కొన్ని బస్తాలకే పరిమితం చేసి.. మిగిలిన సరకునంతటినీ రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. నష్టపోతున్నామని తెలిసినా.. వ్యాపారులు వేసే కొర్రీలతో వారు మిన్నకుండిపోతున్నారు.

ఈనామ్ అమలేది?

మార్కెట్‌లోని వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా పంట ఉత్పత్తులు కొనుగోళ్లు చేయడం సహజమే అయినా.. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్న నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈనామ్ విధానం అమలులోకి వచ్చినా ఇక్కడ అమలు చేయడం లేదు. ఈ విధానంలో ధరల్లో పెద్దగా తేడా ఉండదు. ఇలా గరిష్ఠ ధర ఆశజూపి.. కాయ రంగు మారిందని, తాలు కలిసిందని కొర్రీలు పెడుతూ ధరలను అమాంతం తగ్గించడం కుదరదు. మార్కెట్‌కు సుమారు 11,220 తేజ రకం మిర్చి బస్తాలు వస్తే.. వాటిలో కేవలం 40 బస్తాలకు మాత్రమే రూ.23,300 గరిష్ఠ ధర చెల్లించి, మిగిలిన వాటిని రూ.వెయ్యి నుంచి రూ.3 వేలు తగ్గించి కొనుగోలు చేశారంటే మార్కెట్‌లో కొనుగోళ్ల విధానం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతర్జాతీయంగా ఈ ఏడాది మిర్చికి మంచి డిమాండు ఉంది. రకాలను బట్టి సగటున రూ.20వేల నుంచి రూ.60వేల వరకు పలుకుతున్నా రైతులకు ఆశించిన మేర గిట్టుబాటు ధర రావడంలేదు. మహ్మద్‌పురం దుగ్గొండి మండలానికి చెందిన ఈ రైతు పేరు సొప్పరి సాంబయ్య. ఇతను రెండెకరాల 12 గుంటల పొలంలో దేశీ రకం మిర్చి సాగు చేశారు. మొత్తం రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. 40 బస్తాల వరకు దిగుబడి రాగా.. 9 బస్తాల తాలు కాయను మార్కెట్‌కు తీసుకొచ్చారు. క్వింటా రూ.11వేలు చెల్లించడంతో రైతు



నిర్ఘాంతపోయారు. దేశీ రకం తాలు కాయ గత నెలలో సుమారు రూ.25వేల నుంచి రూ.30 వేల ధర పలికిందని.. ప్రస్తుతం తక్కువకు కొనుగోలు చేస్తున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ రైతు పేరు సభావత్ మోహన్ వరంగల్ జిల్లా సంగెం మండలం ఎలగూరు వాసి. ఎకరం పొలంలో తేజ రకం మిర్చిని సాగుచేయగా.. పెట్టుబడికి రూ.లక్ష ఖర్చయ్యింది. మొదటి కాతలో 6 క్వింటాళ్లు విక్రయించారు. రెండో కాతలో వచ్చిన 24బస్తాలను మార్కెట్‌కు తీసుకొస్తే.. వ్యాపారులు క్వింటా రూ.21,500 ధర చెల్లించారు. పంటలో నిమ్ము ఉందని, కాయ కొంత నల్లబడిందని ధర చెల్లింపులో కోత విధించారని వాపోయారు.

కొర్రీలతో కోత విధిస్తున్నారు

బోజె మొగిలి, లక్నేపల్లి, నర్సంపేట

రెండెకరాల్లో తేజ రకం మిర్చి సాగు చేశాను. మొత్తం రూ.1.90 లక్షల పెట్టుబడి అయింది. మార్కెట్‌కు 20 బస్తాల మిర్చి తీసుకొచ్చాను. తేజ మిర్చి క్వింటా గరిష్ఠ ధర రూ.23,300 పలికింది. నా సరకుకు సుమారు రూ.300 తగ్గిస్తారేమోనని భావించాను. పండుకాయ, తాలు ఉందనే సాకుతో సుమారు రూ.1,500 తగ్గించి కొనుగోలు చేశారు. వివిధ కొర్రీలు వేస్తూ వ్యాపారులు రూ.వేలల్లో కోత విధిస్తున్నారు.

# ఐటీఐ విద్యార్థులకు వరం.. జాతీయ అప్రెంటిస్ మేళా

జనగామ : నవ భారత్ నిర్మాణంలో భాగంగా పట్టణాల్లో అప్రెంటిస్ నియామకాల్ని ప్రోత్సహించడం, శిక్షణ, ఆచరణాత్మక నైపుణ్యాల ద్వారా ఐటీఐ విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించేందుకు కేంద్రం ఇటీవల జాతీయ అప్రెంటిస్ మేళా(పీఎంఎన్ఏఎం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐటీఐ విద్యార్థులకు ఇదొక వరంలా మారనుంది. కోర్సు పూర్తి చేసుకోగానే వారికి నచ్చిన కంపెనీలో అప్రెంటిస్‌లో చేరేందుకు అవకాశం లభిస్తుంది. ప్రతి నెల ఈ మేళాలు ఏర్పాటు చేయాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో 20 వేల మంది

ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వాలు పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఏర్పాటు చేశాయి. త్వరితగతిన స్థిరపడాలనుకునే విద్యార్థులు ఈ కోర్సులను ఎంచుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్





జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు మొత్తం 41 ఉన్నాయి. వీటిలో సుమారు 20 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఏటా సుమారు 5 వేల మంది కోర్సు పూర్తి చేసుకుంటున్నారు. వీరంతా అప్రెంటిప్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వారి పిలుపు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. పరిశ్రమల్లో దరఖాస్తులు ఇచ్చినా ఒక్కోసారి ఫలితం ఉండటంలేదు. మరోవైపు కొన్ని పరిశ్రమలకు సరైన అభ్యర్థులు దొరడం లేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు, పరిశ్రమలను ఒకే వేదిక వద్దకు తీసుకురావడానికి రూపొందించిన విధానమే ఈ జాతీయ అప్రెంటిస్ మేళా.

అవకాశం మేరకు ఎంపిక

ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా అధికారుల ఆదేశాల మేరకు పారిశ్రామిక విద్యను అందిస్తున్న ఐటీఐ కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల ప్రతినిధులను ఆహ్వానిస్తాయి. ఆయా పరిశ్రమల ప్రతినిధులు అవకాశం ఉన్న మేరకు విద్యార్థులను ఎంపిక చేసుకొంటారు. అవసరమైతే అదే పరిశ్రమల్లో ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది.

వివరాలు నమోదు చేసుకోవాలి

కేంద్రం ఈ కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించింది. దీనిలో భాగంగా మేళాలు నిర్వహిస్తున్నాం. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు శిక్షణ కోసం గతంలో పరిశ్రమల చుట్టూ తిరగాల్సి ఉండేది. ఇప్పుడు ఈ మేళాలతో అవకాశం దొరుకుతుంది. ఈ నెల 10న హనుమకొండలో ఈ మేళా నిర్వహిస్తున్నాం. ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిస్ ఇండియా పోర్టల్‌లో వారి వివరాలు నమోదు చేసుకోవాలి.

# ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

జయశంకర్ : రైతులు వేసిన పంటనే మళ్లీ మళ్లీ వేయకుండా పంట మార్పిడి చేస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చని నిపుణులు చెబుతున్నారు.. ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం సూచిస్తోంది.. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే కొత్తరకం పంటలపై దృష్టి సారించాలనే ఉద్దేశంతో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల రైతులు నూతన సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

మూడేళ్ల తర్వాతే చేతికొచ్చేలా..

రెండు జిల్లాల్లో ప్రస్తుతం 2,723.48 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. 2022-23 సంవత్సరానికి జయశంకర్ జిల్లాకు 6,615 ఎకరాల లక్ష్యం కాగా 609 మంది రైతులు 1877.88 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మరో వెయ్యి ఎకరాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ములుగు జిల్లాలో 1,950 ఎకరాల లక్ష్యానికి 192 మంది రైతులు 845.60 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జయశంకర్ జిల్లాలో గతేడాది నాటిన మొక్కలు రెండు మీటర్ల వరకు ఎత్తు పెరిగి పూత వస్తోంది. కాని దానిని తొలగిస్తున్నారు. మూడేళ్ల తర్వాతే పంట చేతికొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

నేలల స్వభావంపై సర్వే

జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఇదివరకే ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, కేంద్ర బృందం పర్యటించి ఇక్కడి పరిస్థితులపై సర్వే చేపట్టింది. నేలల స్వభావం, వాతావరణం, నీటి వనరులు, తదితర సౌకర్యాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమేనని కేంద్ర శాస్త్రవేత్తల బృందం నిర్ధారణ చేసింది. ప్రభుత్వాలు రాయితీలు అందిస్తుండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

వచ్చే ఏడాదికల్లా ప్రాసెసింగ్ యూనిట్లు..

పంట ఉత్పత్తులను మార్కెట్ చేసుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయించేందుకు కంపెనీలను ఎంపిక చేసింది. మొక్క నాటిన తర్వాత 4వ సంవత్సరం పంట చేతికి వస్తుంది. వచ్చే ఏడాదికల్లా జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రయోజనాలెన్నో.. మొక్కలు నాటుకున్న తర్వాత సుమారు 30 నుంచి 35 ఏళ్ల వరకు ఆదాయం సమకూరుతుంది. లి యాజమాన్య, నిర్వహణ తక్కువగా ఉంటుంది. లి రోగాలు, చీడపీడల బెడద తక్కువ.. లి పంటకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. మనదేశంలో ఏడాదికి రూ.70 వేల కోట్లకు పైగా విలువైన పామ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎకరానికి ఏడాదికి రూ.2 లక్షలకు పైగా ఆర్జించవచ్చు. మొక్క నాటిన నాటి నుంచి అంతర పంటలను వేసుకోవచ్చు. డ్రిప్ ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ, బీసీ రైతులకు 90, ఇతరులకు 80 శాతం రాయితీ వర్తిస్తుంది.రైతులకు అవగాహన..ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు మరింతగా అవగాహన కల్పించనున్నారు. పంట సాగు, దిగుబడులు, ఆదాయం, తదితర సందేహాల నివృత్తికి వారంలోగా నాలుగు రోజులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

జిల్లాల్లోనే పంటను విక్రయించుకోవచ్చు సంజీవరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, జయశంకర్ భూపాలపల్లిఆయిల్‌పామ్ సాగుకు జిల్లాలో అనుకూల పరిస్థితులున్నాయి. ఇతర పంటల కన్నా లాభదాయకంగా ఉంటుంది. చీడపీడల బాధ, ప్రకృతి వైపరీత్యాల నష్టం కూడా తక్కువే.. రైతుల నుంచి స్పందన బాగుంది.

# ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

మంచిర్యాల : ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవల అందించేలా కృషి చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఏజెన్సీ ప్రాంతాలలో అందుతున్న వైద్య సేవలు, అంగన్‌వాడీల పనితీరు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. మారుమూల గ్రామాలలోని మహిళలకు ప్రభుత్వ ఆస్పత్రులలోనే ప్రసవాలు జరిగేలా ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్యాధికారులు ప్రోత్సహించాలన్నారు. కేసీఆర్ కిట్‌తో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్యను అవుట్ పేషెంట్‌ల సేవలను పెంచాలన్నారు. రక్తహీనత, క్షయ వంటి రోగులను గుర్తించి తరచూ ఆరోగ్య పరీక్షలను అందిస్తూ.. వ్యాధి నివారణ చర్యలను చేపట్టాలన్నారు. మెడికల్ బయోవెస్టేజ్‌లను సంబంధింత ఏజెన్సీలకు అప్పగించాలని సూచించా



రు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు క్షేత్రస్థాయిలో ప్రతీరోజు పర్యవేక్షించాలన్నారు. మారుమూల గూడాలు, తండాలలోని మహిళలకు మరుగుదొడ్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, సఖీ కేంద్రం సేవలను విస్తరించాలన్నారు. గిరిజన ప్రాంతాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్‌లలో పౌష్టికాహారమైన భోజనం అందించాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, తాజా కూరగాయాలు వినియోగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుడిమెత మనోహర్, డీడీ సంధ్యారాణీ, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, కేజీబీవీ సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ, పీహెచ్‌సీల డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీబిలో ఇంటి దొంగలు!

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణాల మంజూరీలో భారీ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయి. కొందరు అధికారులు రుణాల పేరిటా నిధులను పక్కదారి పట్టించి జేబులో వేసుకోవడం వెలుగులోకి వచ్చింది. కంచె చేను మేసిన విధంగా సహకార బ్యాంకు అధికారుల తీరు మారిందన్న విమర్శలు వస్తున్నాయి. బేల మండల బ్రాంచ్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేసే శ్రీపత్‌కుమార్ అనే ఉద్యోగి అదే బ్రాంచ్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌ల సహకారంతో అక్రమాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ నెల 7న ఆడిట్ అధికారుల తనిఖీల్లో అసలు విషయం బయట పడింది. ఇప్పటి వరకు రూ.2కోట్ల 86లక్షల 40వేలను పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. గతేడాది సెప్టెంబరు 13 నుంచి ఈఏడాది ఫిబ్రవరి 28వరకు అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. అయితే రైతులు రుణాల చెల్లింపులో జాప్యం జరిగితే ఎంతో హడావుడి, హంగామా చేసే బ్యాంకు అధికారులు ఐదు మాసాలుగా అక్రమాలు జరుగుతున్నా గుర్తించక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 42 సహకార బ్యాంకుల పరిధిలో రూ.900ల కోట్ల రుణాలను అందించారు. ఇందులో రూ.450 కోట్లు క్రాప్‌లోన్స్, రూ.360కోట్లు దీర్ఘకాలిక రుణాలు,మరో రూ.100కోట్లు ఇతర రుణాలను అందించారు. ఇందులో సుమారుగా రూ.70కోట్ల మొండి బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలోనే బ్యాంకు అధికారులే నిధులు పక్కదారి పట్టించడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. భారీ మొత్తంలో అక్రమాలు జరగడంతో బ్యాంకు మనుగడ ప్రమాదకర పరిస్థితుల్లో పడింది.

బంధువుల ఖాతాల్లోకి నగదు బదిలీ..

ఉన్నతాధికారుల కళ్లుగప్పి అక్రమాలకు పాల్పడిన స్టాఫ్ అసిస్టెంట్ శ్రీపత్‌కుమార్ తెలివిగా తన బంధువుల ఖాతాల్లోకి నగదును బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. మొదట సెప్టెంబరు 13న ఇతర ఖాతాల్లోకి నగదును బదిలీ చేసిన ఆయన ఫిబ్రవరి 28 వరకు 18 సార్లు నగదును బదిలీ చేసినట్లు విచారణలో తేలింది. అలాగే పలువురు బ్యాంకు ఉద్యోగుల ఖాతాల్లోకి నగదును జమ చేసి జేబులో వేసుకున్నట్లు సమాచారం. బేల బ్రాంచ్ మేనేజర్ టి.రాజేశ్వర్, అసిస్టెంట్ మేనేజర్ వై.రణిత డిజిటల్ సంతకాలతో పలుమార్లు నగదును బదిలీ చేసినట్లు తెలుస్తోంది. శ్రీపత్‌కుమార్ బంధువులైన హిమాబిందు, నారాయణ,దివ్య అకౌంట్లలోకి నగదు బదిలీ అయినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు సుమారుగా రూ.45లక్షల నగదును సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అసలు సూత్రధారులు ఎవరు?

సహకార బ్యాంకు నిధుల అక్రమాలపై ఇప్పటి వరకు 11 మంది ఉద్యోగుల పై సస్పెన్షన్ వేటు వేసిన ఉన్నతాధికారులు అసలు సూత్రధారులు ఎవరన్న దానిపై ప్రత్యేక దృష్టిని సారించారు. బేల మండల బ్రాంచ్ నుంచి ఉమ్మడి జిల్లాలోని పలు బ్రాంచ్‌లో పని చేస్తున్న అధికారుల ఖాతాల్లోకి నగదు బదిలీ కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. సస్పెన్షన్ అయిన వారిలో బేల బ్రాంచ్ స్టాఫ్ అసిస్టెంట్ శ్రీపత్‌కుమార్‌తో పాటు బేల బ్రాంచ్ మేనేజర్ టి.రాజేశ్వర్, అసిస్టెంట్ మేనేజర్ వై.రణిత, స్టాఫ్ అసిస్టెంట్ ఎ.రాహుల్, మంచిర్యాల జిల్లా జన్నారం బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ అసిస్టెంట్ బి.రమేష్, మేనేజర్ బి.వేణుగోపాల్, స్టాఫ్ అసిస్టెంట్ జి.ప్రవీన్, ఆదిలాబాద్ కేంద్ర సహకార బ్యాంక్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.నితిన్, భీంపూర్ బ్రాంచ్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్, ఆదిలాబాద్‌రూరల్ బ్రాంచ్ మేనేజర్ సవిత, ఆదిలాబాద్ కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ ఎస్.ప్రవీణ్ ఉన్నారు. వీరందరి ఖాతాల్లోకి నగదు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. మరింత లోతుగా దర్యాప్తు చేపడితే మరికొంత మంది అధికారుల అక్రమాలు బయట పడే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అండదండలతోనే అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు కూడా లేక పోలేదు.

అక్రమాలపై సభ్యులతో చర్చ...బేల బ్రాంచ్‌లో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు గురువారం డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి అధ్యక్షతన హుటాహుటిన సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి అక్ర మాలపై చర్చించారు. అక్రమాల్లో ఉద్యోగుల ప్రమేయం, రుణాల వసూలు, రికవరీపై ప్రధానంగా చర్చించారు. వెంటనే సంబంధిత ఉద్యోగుల నుంచి సొమ్మును రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు.ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఆర్థిక నేరాల కింద రాష్ట్ర సీఐడికి ఫిర్యాదు చేసి అక్రమాలకు పాల్పడిన బ్యాంకు ఉద్యోగుల ఆస్థులను జప్తు చేయాలని తీర్మానించారు.కఠిన చర్యలు తీసుకుంటాం.. – అడ్డి భోజారెడ్డి (డీసీసీబీ చైర్మన్, ఆదిలాబాద్)అక్రమాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురిపై సస్పెన్షన్ వేటు వేశాం. ఇప్పటి వరకు రూ.2కోట్ల 86లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు.ఐదు మాసాలుగా అక్రమాలు జరుగుతున్నట్లు తెలిసింది. రోజువారి లావాదేవీలపై మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించాం. అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసి బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటాం.

# అడ్డుకట్ట పడేనా?




జగిత్యాల : గంజాయి సాగు, సరఫరాపై కఠిన చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయాలని పోలీసుల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అక్రమ రవాణా, అక్కడక్కడా సాగు కూడా జరుగుతోంది. జిల్లాలో గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఏ మేరకు సఫలీకృతం అవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 28వ తేదీన హైద్రాబాద్‌లో సీఎం కేసీఆర్ పోలీసు, ఎక్సయిజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాల వాడకాన్ని సమూలంగా నిలిపివేయాలని, గంజాయి సాగు చేసే గ్రామాలకు రైతుబంధు, సబ్సిడీలు బంద్ చేయాలని, డ్రగ్స్‌ఫ్రీ గ్రామాలకు ప్రత్యేక ఫండ్స్, ప్రోత్సాహకాలు ఇవ్వాలని, డ్రగ్స్ దందా చేసేవారిపై పీడీయాక్టు, కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ధేశం చేశారు. డ్రగ్స్ కంట్రోలు చేయడంలో చురుకుగా వ్యవహరించిన అధికారులకు ఆగ్జిలరీ ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతో ఎక్సైజ్ పోలీసు అధికారుల దృష్టి డ్రగ్స్ కంట్రోల్ చేయడంపై పడింది. ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇరత రాష్ట్రాల నుంచి సరఫరా

జగిత్యాల జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి జోరుగా రవాణా అవుతోంది. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ మీదుగా జగిత్యాల జిల్లాకు గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతుందన్న ఆరోపణలున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా డబ్బాలలో నింపి రవాణా చేస్తున్నారని తెలుస్తోంది. గంజాయి నుంచి పొడి వేరు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు అనుమానాలున్నాయి. నాణ్యతను బట్టి గ్రాముకు రూ. 500 నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇతర జిల్లాలు, రాష్టాలకు చెందిన కొంత మంది వ్యక్తులను నియమించుకొని వారితో అక్రమ వ్యాపారం, రవాణా చేయిస్తున్నారు.

జిల్లాలో గంజాయి కేసులు జిల్లాలో గడిచిన మూడేళ్లలో గంజాయి కేసులు జోరుగా నమోదయ్యాయి. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో మూడేళ్లలో 25 గంజాయి కేసులు నమోదయ్యాయి. ఇందులో 68 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 44.365 కిలో గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఇందులో 2019 సంవత్సరంలో 3 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేయగా, వీరి వద్ద 4.200 కిలో గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. 2020 సంవత్సరంలో 8 కేసులు నమోదు కాగా 18 మంది అరెస్టు అయి వీరి వద్ద 10 కిలో గంజాయి పట్టుపడింది. 2021 సంవత్సరంలో 14 కేసులు నమోదు కాగా 38 మంది అరెస్టు అయి 30.165 కిలో గ్రాముల గంజాయి పట్టుపడింది.గంజాయి మత్తులో యువత

జిల్లాలో గంజాయి మత్తులో యువత జోగుతోంది. గంజాయి రవాణా, విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. గంజాయి లభించని సందర్భాల్లో యువత మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే మత్తు పదార్థాలను సేవిస్తున్నట్లు తెలిస్తోంది. ప్రధానంగా హుక్కాషాట్, బాటిల్ షాట్, ఓసీబీ పేపర్, మెడికల్ దుకాణాల్లో లభించే వైట్‌నర్ లాంటివి సేవిస్తున్నారు. దీంతో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల జిల్లాకు ప్రధానంగా మంచిర్యాల, నిర్మల్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి గంజాయి సరాఫరా అవుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన గంజాయిని జగిత్యాల ప్రాంతంలో కొందరు వ్యక్తులు రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులు వీటిని పాత కార్లలో స్టీరింగ్ కింద, సీట్ల కింద, స్టెపిన్ టైర్లలో, పాత స్కూటర్ల డిక్కిల్లో పోలీసులకు అనుమానం రాకుండా రవాణా చేస్తున్నారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగవుతుందన్న ఆరోపణలున్నాయి.

అక్రమార్కులకు నేతల అండదండలు

జిల్లాలో గంజాయి, గుడుంబా, పేకాట, గుట్కా తదితర అక్రమాలలో కొందరు పలుకుబడి గల వ్యాపారులు, నేతల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ అధికార పార్టీకి చెందిన నాయకునిగా చలామణి అవుతున్న వ్యాపారి ఒకరు తనకున్న పరిచయాలతో అక్రమ వ్యాపారులకు సహకారం అందిస్తున్నట్లు విమర్శలున్నాయి. ప్రతి నిత్యం పోలీసు అధికారుల చుట్టూ, ఠాణాల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్న కొందరు వ్యక్తులు అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతోనైనా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగానికి అడ్డుకట్టపడుతాయా, లేదా అన్నది వేచి చూడాల్సిందే.

# కార్మికక్షేత్రంలో పరుచుకున్న పచ్చదనం

ఆదిలాబాద్ :సింగరేణి కార్మిక కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో పచ్చదనం పరుచకపోయింది. ఒక్కొక్క మొక్క నాటి గోలేటిని హరిత తోరణంలా తలపించే విధంగా తీర్చిదిద్దారు. అందుకే ఓ చక్కటి నినాదం ఉంది. అదే సృష్టిలో మనిషి తలుచుకుంటే సాధించనిది ఏమి లేదన్నట్లుగా ఇక్కడ నల్ల నేలలో పచ్చదనం అందాలు కన్పిస్తుంటాయి. ఒకప్పుడు వృథాగా ఉన్న నేలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి ప్రాంతంలో ఎక్కడ చూసిన హరిత తోరణాలతో స్వాగతం పలుకుతాయి. యాజమాన్యం పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనగడ సాధ్యమన్న విషయాన్ని గ్రహించి లక్షల సంఖ్యలో మొక్కలు నాటి వృక్షాలుగా మార్చారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసి ప్రజానీకనానికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. కాలుష్య నివారణతో పాటు కార్మిక కుటుంబాలు ఆహ్లాదకరం.. ఆనందాన్ని పొందుతున్నారు.

పచ్చని చెట్లు పకృతి అందాల ఉద్యానవనం

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉద్యానవనం పచ్చని చెట్లతో నిండుకపోయింది. రకరకాల మొక్కలతో పాటు సువాసన వెదజల్లే పూల మొక్కలు సందర్శకులను ఆకర్శించే విధంగా ఏర్పాటు చేసిన మొక్కలు చూస్తే చాలు కాసేపు సేద తీరాలన్పింస్తుంది. ఉద్యానవనంలోకి కాలుమోపగానే పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతాయి. నిత్యం చిన్న పిల్లలతో పాటు పెద్దలు కాలక్షేపం కోసం అలా పార్కుకు వస్తుంటారు. ఎత్తైన చెట్లను ముచ్చటించే పూలను చూస్తే ఇలా పులకరింపజేస్తాయి. హరితహారాన్ని సంరక్షించుకోవడానికి సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి, కాంట్రాక్టు కార్మికులతో పని చేయిస్తుంటుంది. కార్మిక వాడల్లో మధ్యలో ఉన్న ఉద్యానవనం పచ్చదనంతో నిండిపోయింది.

శుభాకార్యాలకు వచ్చే

గోలేటిలోని సీఈఆర్ క్లబ్, షటిల్ కోర్టు, ఆఫీసర్ క్లబ్, గెస్టు హౌజ్, కార్మికుల క్వార్టర్లు పచ్చని చెట్లతో ఆకర్శిస్తాయి. క్లబ్‌లలో శుభాకార్యాలయాలు చేసుకునే వారికి ఆహ్లాదకరమైన వాతావరణంతో పలుకరిస్తాయి. సీఈఆర్ క్లబ్‌లోకి వెళ్లే ముఖ ద్వారం వద్ద నుంచి మొదలుకొని భవనంలోకి వెళ్లే వరకు ఇరువైపుల పచ్చని చెట్లు చక్కటి నీడ ఇస్తాయి. పంక్షన్‌కు వచ్చే అతిథులకు మంచి అనుభూతిని అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపుతుంది. ఏది ఏమైన ప్రతి ఒక్కరూ పర్యావర పరిరక్షణ కోసం మొక్క నాటినప్పుడే మానవళికి మనుగడ ఉంటుందనే ఆలోచన గోలేటి కార్మిక వాడల్లో కనబడుతుంది. సింగరేణి డిస్పెన్సరీ, కార్మిక వాడల్లో రహదారికి ఇరువైపుల పెరిగిన చెట్లు చక్కటి వాతావరణాన్ని అందిస్తున్నాయి. రెండేళ్ల క్రితం శ్రీ భీమన్న ఆలయానికి వెళ్లే రహదారి పక్కన మొక్కలు నాటారు. అవి భవిష్యత్తులో వృక్షాలుగా మారి, భక్తులకు నీడను అందించనున్నాయి.

గోలేటిలోని కోదండ రామాలయం ఆవరణలో ఉన్న చెట్లు చల్లటి నీడతో పాటు మంచి వాతావరణాన్ని అందిస్తాయి. నిత్యం మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు, పూజల అనంతరం కాసేపు చెట్ల కింద సేద తీరుతుంటారు. పచ్చని మొక్కలతో మానవళికి మనుగడ అన్న విషయం మర్చిపోవద్దు అనే విధంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు.

జీఎం కార్యాలయం ఆవరణలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణ పచ్చని చెట్లతో నిండిపోయింది. జీఎం కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు వస్తున్న ఉద్యోగులకు చల్లటి వాతావరణాన్ని అందించేందుకు చెట్లను పెంచుతున్నారు. జీఎం కార్యాలయం ముందు భాగమే కాకుండా ప్రాంతమంతా సంచరించుకపోయింది. ఎండలో వచ్చే ఉద్యోగులు కాసేపు చెట్ల కింద సేద తీరిన తర్వాతే కార్యాలయానికి వెళ్లాలనే అనే ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం లభిస్తుంది. ఎక్కడ చూసిన పచ్చని శోభతో ఉద్యానవనంలా తలపించేలా దర్శమిస్తుంది. జీఎం బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో ఈ ఏడాది మరిన్ని పూల మొక్కలు పెంచుతున్నారు.

# సింగరేణి.. యువ బాణీ

గోదావరిఖని : సింగరేణిలో నవతరం ఉరకలెత్తుతోంది.. ఏడేళ్లలో 16 వేల మంది కొత్త ఉద్యోగులు చేరారు.. పాతికేళ్లుగా ఉద్యోగ నియామకాలు నిలిపివేసిన సింగరేణి పాతతరం కార్మికులతోనే పనులు చేపట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారసత్వ ఉద్యోగాలతో పాటు ప్రతిభ ఆధారంగా నియామకాలతో సింగరేణి యువతరంతో నిండిపోయింది. సింగరేణిలో ప్రస్తుతం 42,534 మంది పనిచేస్తుండగా ఇందులో 16,042 మంది యువకులే ఉన్నారు. వీరంతా 40 ఏళ్ల లోపు వారే. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు యువరక్తం సింగరేణికి భవిష్యత్తులో సేవలందించే అవకాశం ఉంది. కనీస విద్యార్హత లేకుండానే సింగరేణిలో పనులు చేసే కార్మికులున్న స్థాయి నుంచి ఉన్నత విద్యావంతులు కూడా చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. సింగరేణి సంస్థ 1995 నుంచి నియామకాలు నిలిపివేసింది. పాతికేళ్లుగా ఒక్క నియామకం చేపట్టలేదు. పదేళ్ల క్రితం వరకు సింగరేణిలో 50 ఏళ్లు దాటిన వారే ఎక్కువగా ఉన్నారు. చాలా మందికి కీళ్ల నొప్పులు.. ఎముకలు అరగడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ విధులు నిర్వహించేవారు. చాలా మంది కార్మికులు మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయి తమ వారసులకు ఉద్యోగాలు పెట్టించారు. దీంతో సింగరేణిలో ఏడేళ్లలో ఒక్కసారిగా యువ ఉద్యోగులు పెరిగారు.

ఉన్నత విద్యావంతులు : సింగరేణిలో ప్రస్తుతం ఎక్కువ శాతం మంది ఉన్నత విద్యావంతులు సంస్థలో పనిచేస్తున్నారు. కొత్తగా చేరిన వారంతా ఉన్నత విద్యను అభ్యసించినవారే. ఇందులో మహిళా ఉద్యోగులు కూడా ఉన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారంతా ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ, డిప్లొమా, ఐటీఐ విద్యావంతులు ఎక్కువ శాతం మంది ఉన్నారు. సింగరేణిలో ప్రస్తుతం 'తట్టా చెమ్మాస్' విధానం లేకపోవడంతో యువ ఉద్యోగులు ఎక్కువ శాతం చేరేందుకు ముందుకొస్తున్నారు. తండ్రుల వారసత్వంగా ఉపాధి పొందేందుకు మొగ్గు చూపుతున్నారు. భూగర్భంలోనూ యంత్రాల ద్వారానే పనులు చేపడుతుండటంతో సులభతరంగా మారింది. సింగరేణిలో ఒక దశలో కనీస అక్షరాలు కూడా తెలియని కార్మికులు పనిచేశారు. వేలిముద్ర వేసి వేతనాలు తీసుకునే స్థాయిలో సింగరేణిలో పనిచేశారు. దీంతో సింగరేణి యాజమాన్యం కార్మికులకు చదువు నేర్పించేందుకు గనులపై అక్షరాభ్యాసం చేయించారు. కాలనీల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం అందులోంచి బయటకు వచ్చిన సింగరేణి యువ ఉద్యోగులతో నిండిపోయింది. మరిన్ని కొత్త నియామకాలుసింగరేణిలో మరిన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు కొత్త నియామకాలు చేపట్టనుంది. 2014 నుంచి ఇప్పటి వరకు 58 నోటిఫికేషన్‌లను విడుదల చేసి బయటి వారిని భర్తీ చేసుకున్న సింగరేణి మరికొన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇదివరకు సాంకేతిక ఉద్యోగులు, సంక్షేమ అధికారులు, క్లరికల్ ఉద్యోగులను విద్యార్హతల ఆధారంగా చేర్చుకుంది. వీరితో పాటు కారుణ్య నియామకాల ద్వారా వారసులకు సంస్థలో ఉద్యోగాలు కల్పించింది. కొత్తగా ఏర్పడ్డ ఖాళీలను మరోసారి నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టనుంది.

# విద్యార్థుల భోజనంపై ఫోకస్

నిర్మల్: గతవారం రోజుల నుంచి పలు విద్యాసంస్థల్లో అక్కడి విద్యార్థులకు అందించే భోజనాలు వికటిస్తున్న సంఘటనలపై సంబంధిత ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పొరుగుజిల్లాల్లోని విద్యాసంస్థల్లో కూడా ఆహారం వికటించి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్న నేపథ్యంలో యంత్రాంగమంతా ఇటువైపే ఫోకస్ పెట్టింది. జిల్లాలోని ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో గత రెండు, మూడు రోజుల నుంచి విద్యార్థులకు అందించే భోజనంలో కప్పలు, బొద్దింకలు లాంటి వాటి అవశేషాలు బయటపడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనల కారణంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అక్కడి హాస్టల్‌లో భోజనం చేసేందుకు జంకుతున్నారు. ఈ వ్యవహారం ఇలా కొనసాగుతుండగానే ఉ మ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు ఆసుపత్రుల పాలైన సంఘటనలు వెలుగు చూశా యి. ముఖ్యంగా కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్‌లతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న భోజనం నాణ్యత లేకుండా ఉం టోందన్న ఆరోపణలున్నాయి. ఇలా నాణ్యత లేని ఆహారం తింటూ విద్యార్థులు తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలుప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ ఇలా ఆహారం వికటించి అస్వస్థతకు గురైన సంఘటనలు వరుసగా వెలుగుచూస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అలర్ట్ అవుతున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో వెలుగుచూస్తున్న సంఘటనలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక అధికారులను విచారణ కోసం రంగంలోకి దించింది. అలాగే కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఆ భోజనం కోసం ఉపయోగించిన ఆహారదినుసుల నాణ్యతను పరిశీలించేందు కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. సంబంధిత హెడ్మాస్టర్‌లకు సైతం జిల్లా విద్యాశాఖ అధికారి ఇప్పటికే మధ్యాహ్న భోజనంకు సంబందించి మార్గదర్శకాలను జారీచేశారు. ప్రతిరోజూ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం కోసం ఓ టీచర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించాలని అలాగే హెడ్మాస్టర్‌లు మధ్యాహ్న భోజనంకు సంబందించి వంట మొదలైనప్పటి నుంచి పిల్లలు తినే వరకు పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఇప్పటికే హెడ్మాస్టర్‌లందరికి సూచనలు జారీ చేశారు. అలాగే ఆకస్మిక తనిఖీలకు సంబంధించి ప్రత్యేకబృందాలు రంగంలోకి దిగబోతున్నాయన్న సంకేతాలను సైతం హె డ్మాస్టర్‌లకు అందించారు. మధ్యాహ్న భోజనంలో వినియోగించే కూరగాయలను శుభ్రం చేయాలని అలాగే పిల్లలందరు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కునే విధంగా ఉపాధ్యాయులు చూడాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు బియ్యం, వంటసామాగ్రి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. భోజనం తరువాత బడి పిల్లలను పరిశీలించాలంటూ కూడా అధికారులు తమ ఆదేశాల్లో సంబందిత హెడ్మాస్టర్‌లను కోరారు. వరుస సంఘటనలతో హై అలర్ట్‌కాగా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లాలో కూడా చోటు చేసుకుంటుండడంతో సంబంధిత అధికారులంతా అలర్ట్ అవుతున్నారు. ముఖ్యంగా కస్తూరిభా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్కడి ప్రత్యేక అధికారులకు మధ్యాహ్న భోజనంపై నిర్దిష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నారు. దీంతో పాటు సెక్టోరియల్ అధికారులను కూడా అప్రమత్తం చేసి ఆకస్మిక తనిఖీలతో పాటు నిరంతర తనిఖీల కోసం షెడ్యూల్‌ను రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. రెసిడెన్షియల్‌స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సంబంధిత ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్‌లు మధ్యాహ్న భోజనంను పకడ్బందీగా చేపట్టాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎలాంటి సంఘటనలు జరి గినా సంబంధిత ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్‌లదే బాధ్యత అవుతుందని అలాగే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఇన్‌చార్జ్ కూడా బాధ్యత వహించాల్సి వస్తుందంటూ ఆదేశాలు వెలువరించారు. రంగంలోకి ప్రత్యేక బృందాలుజిల్లావ్యాప్తంగా కస్తూరిభా పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్, మండ ల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం పథకంను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. ఈ మేరకు ఈ బృందాలను మండలాల వారీగా నియమించారంటున్నారు. ఆకస్మిక బృందాలు మధ్యాహ్నభోజనం కోసం వినియోగిస్తున్న కూరగాయలను, ఇతర ఆహార దినుసులను అలాగే మధ్యాహ్న భోజనం చేసే వంటగదుల వద్ద ఉన్న వాతావరణాన్ని పరిశీలించనున్నారు. అలాగే పిల్లలు భోజనం చేసే సమయంలో ఎలాంటి పరిశుభ్రతను పాటిస్తున్నారోననే అంశాన్ని కూడా వీరు గమనించనున్నట్లు చెబుతున్నారు. తాగునీరు విషయంలోనూ, వంట పాత్రల శుభ్రత విషయంపై కూడా వీరు తెలుసుకోనున్నారు. తమ తనిఖీల్లో లోపాలు వెలుగుచూస్తే సంబంధిత పర్యవేక్షకులపైనే చర్యలు తీసుకుంటామంటూ కూడా హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఆకస్మిక బృందాలు ప్రతిరోజూ తమకు కేటాయించిన మండలాల్లో కనీసం నాలుగైదు పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు సమాచారం. దీనికోసం గాను స్పెషల్‌డ్రైవ్ ను చేపట్టబోతున్నట్లు విద్యా?శాఖ అదికారులు పేర్కొంటున్నారు. బాసర ట్రిపుల్ ఐటీ ఘటనతో అప్రమత్తం బాసర ట్రిపుల్‌ఐటీలో వరుసగా చోటు చేసుకున్న సంఘటనలపై కూడా జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీ హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహారం కలుషితమైందే కాకుండా ఆ ఆహారంలో కప్పలు, పురుగులు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. దీంతో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులందరు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అలాగే ట్రిపుల్‌ఐటీ అధికారులతో జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై ఆరా తీసినట్లు తెలిసింది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలుడాక్టర్ రవీంధర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అ?ధికారి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి కే అన్ని పాఠశాలలకు నాణ్యతపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశాం. కేజీబీవీల్లో ప్రత్యేకాధికారులే మధ్యాహ్న భోజనం బాధ్యతలను పూర్తిగా పర్యవేక్షించాలి. అలాగే పాఠశాలల్లో సంబంధిత హెడ్మాస్టర్‌లు పకడ్భంధీగా పర్యవేక్షించాలి. అలాగే కూరగాయలను శుభ్రం చేసి వంటకు ఉపయోగించాలి. భోజననిర్వహకులకు కూడా స్పష్టమైన ఆదేశాలు అందించాలి. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులందరికి మధ్యాహ్న భోజన మార్గదర్శకాలపై స్పష్టమైన ఆదేశాలు అందించాం. మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నాం.



# అసెంబ్లీలో నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

విజయవాడ: నూతనంగా ఎన్నికైన శాసన మండలి సభ్యులు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు.

శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు వీరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల, మంత్రులు అంబటి , కారుమూరి, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

**ప్రమాణ స్వీకారం చేసిన 9 మంది ఎమ్మెల్సీలు..** మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీత, బొమ్మి ఇస్రాయిల్, జయ మంగళ వెంకటరమణ, పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, పెనుమత్స సూర్యనారాయణ రాజు, మంగమ్మ.

# రిషికొండ తవ్వకాలపై హైకోర్టుకు కేంద్ర కమిటీ నివేదిక



అమరావతి : రిషికొండ తవ్వకాలపై హైకోర్టుకు కేంద్ర కమిటీ నివేదిక ఇచ్చింది. నివేదికపై కౌంటర్ దాఖలు చేయాలని పిటీషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 26 కి న్యాయస్థానం వాయిదా వేసింది. రిషికొండపై నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని నసేన కార్పొరేషన్ మూర్తి యాదవ్, టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై నేడు విచారణ జరిపింది. రిషికొండపై జరుగుతున్న తవ్వకాలు, భవన నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలని ఇటీవల న్యాయస్థానం కమిటీని ఏర్పాటు చేసింది. విశాఖలోని రుషికొండ అక్రమ తవ్వకాలపై వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు తామే కమిటీని నియమిస్తామని హైకోర్టు గతంలో తేల్చిచెప్పింది. కంటి తుడుపుగా కమిటీ వేశారంటూ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ(ఎంవోఈఎఫ)పై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కమిటీలో ఏపీకి చెందిన అధికారులకు చోటు ఎలా కల్పిస్తారని ప్రశ్నించింది. కమిటీ కూర్పుపై తాము సంతృప్తిగా లేమని వ్యాఖ్యానించింది. కేంద్రం వేసిన కమిటీపై అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్. జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌కి విరుద్ధంగా విశాఖజిల్లా, చినగదిలి మండలం, ఎండాడ గ్రామం పరిధిలోని సర్వేనెంబరు 19లో రుషికొండను తవ్వేయడంతో పాటు చెట్లను తొలగిస్తున్నారని పేర్కొంటూ విశాఖ తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన నాయకుడు పీవీఎన్ఎన్ మూర్తి యాదవ్ వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఇవి ఇటీవల విచారణకు రాగా కొండపై నిర్మాణాలు చేపట్టేందుకు జరిపిన తవ్వకాలపై సర్వే నిర్వహించి, నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ-అటవీ మంత్రిత్వశాఖను కోర్టు ఆదేశించింది. బాధ్యతాయుతమైన అధికారి నేతృత్వంలో కమిటీ వేయాలని స్పష్టం చేసింది.

ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా అనుమతులకు మించి కొండను తవ్వేశారని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంటోందని, ఈ విషయంలో అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయని ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కమిటీలో స్థానం ఎలా కల్పిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. కమిటీ ఏర్పాటుపై మరోసారి పరిశీలన చేయాలంది.

# టీడీపీ నేత కల్యాణి అరెస్ట్‌పై డీజీపీకి అనిత లేఖ



అమరావతి: టీడీపీ మహిళా నేత ముల్పూరి కళ్యాణి అక్రమ అరెస్ట్‌పై చర్యలు కోరుతూ జాతీయ మహిళా కమిషన్, డీజీపీకి తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత లేఖ రాశారు. గత మూడున్నరేళ్లలో డ్రగ్స్ నేరాలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారిందన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంతో పాటు మహిళలపై నేరాలు, అఘాయిత్యాలు క్రమంగా పెరుగుతున్నాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి నేరాల నియంత్రణకు బదులుగా ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటోందని మండిపడ్డారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేస్తే టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. తెలుగు మహిళా నాయకురాలు ముల్పూరి కళ్యాణిని నిందితురాలిగా చేర్చారన్నారు. ఏప్రిల్ 10న గన్నవరం, హనుమాన్ జంక్షన్ పోలీసులు కళ్యాణి ఇంట్లోకి చొరబడి ఆమెను బలవంతంగా తీసుకెళ్లారని.. దుస్తులు మార్చుకునేందుకు కూడా అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమక్షంలోనే దుస్తులు మార్చుకోవాలని బలవంతం చేశారన్నారు. ఇది తన వ్యక్తిగత స్వేచ్ఛా హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమే అని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం, పోలీసులు మహిళలపై నేరాలు కట్టడి చేసే బదులు ప్రతిపక్ష టీడీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోసుకుంటున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కళ్యాణి అక్రమంగా అరెస్టు ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించిన పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనిత లేఖలో పేర్కొన్నారు.

# మహిళలు భరోసాగా బతకాలన్నదే సీఎం వైయస్ జగన్ ఆలోచన

## మార్కాపురం సభలో బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ





ప్రకాశం జిల్లా: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, కుటుంబానికి భరోసాగా బతకాలన్నదే సీఎం వైయస్ జగన్ ఆలోచన అని, అందుకే అక్కచెల్లెమ్మల పేరుమీదే అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మార్కాపురంలో వైయస్ఆర్ ఈబీసీ నేస్తం పథకం రెండో విడత అమలు కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన పాల్గొని మాట్లాడారు. ఈ రాష్ట్రంలోని ప్రతి పేద మహిళ కష్టం, ఉన్నతి పట్ల ఎంత అంకితభావంతో ఉన్నందున ఆ నారీలోకమంతా సీఎం వైయస్ జగన్‌ను దీవించారు, అందుకే సకాలంలో వర్షాలు, ప్రాజెక్టులు నిండాయి, అధికంగా దిగుబడులు వచ్చాయి, నారీలోకం పండుగ చేసుకుంటుంది. పేదరికం అనే పెద్ద రోగాన్ని తరిమేయాలని సీఎం వైయస్ జగన్ తపస్సు చేశారు, అగ్రవర్ణ పేద మహిళలకు ఈబీసీ నేస్తం పేరుతో మూడేళ్ళపాటు ఏటా రూ. 15 వేల చొప్పున సాయం చేస్తున్నారు. బటన్ నొక్కగానే అక్కచెల్లెమ్మల బ్యాంక్ ఖాతాలకు నేరుగా చేరుతున్నాయి, ఏ మహిళ అయినా భరోసాగా బతకాలన్నదే సీఎం ఆలోచన, మహిళలను దేశానికి ఆదర్శంగా, జ్యోతిరావుపూలే బాటలో ముందుకెళుతున్నారు. ముందుతరాలకు కూడా భరోసానిచ్చే పాలన అందజేస్తున్న సీఎం వైయస్ జగన్‌కి ధన్యవాదాలు అని మంత్రి చెల్లుబోయిన అన్నారు.

**కాసుల వెంకట అరుణ, లబ్ధిదారు, మార్కాపురం** – అన్నా.. నా భర్త చిన్న ఉద్యోగస్తుడు, అగ్రవర్ణాలలోని మాలాంటి పేదలను గుర్తించి మీరు సాయం చేస్తున్నారు, ధన్యవాదాలు అన్నా, ఈ డబ్బుకు రూ. 15 వేలకు తోడు మరికొంత కలుపుకుని కిరాణాషాప్ పెట్టుకోవాలనుకుంటున్నాను, నాకు ఇద్దరు పిల్లలు, అమ్మ ఒడి సాయం అందింది, గతంలో ఎప్పుడూ లేని విధంగా నాడు – నేడు కార్యక్రమం ద్వారా స్కూల్స్ బాగుచేశారు, జగనన్న గోరుముద్ద బాగుంది, మంచి పౌష్టికాహారం ఇస్తున్నారు, మా పాపకు ట్యాబ్ ఇచ్చారు, బాగా చదువుకుంటుంది, మా పాప కూడా సీఎంకి థ్యాంక్స్ చెప్పమంది, థ్యాంక్స్ అన్నా, మాలాంటి పేదలకు సొంతింటి కల నెరవేరింది, మీరు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయి, ప్రజల వద్దకు పాలన కాదు ప్రజల దగ్గరికే పాలన అందుతుంది, మీరు కలకాలం చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను, మా ప్రాంతానికి మెడికల్ కాలేజ్ ఏర్పాటుచేసినందుకు ధన్యవాదాలు



# ఆ నమ్మకంతోనే భాజపాలో చేరా

విజయవాడ: పదవులు ఆశించి భాజపాలో చేరలేదని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. తన సేవలు పార్టీకి ఎక్కడ అవసరమైతే అక్కడ పనిచేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. విజయవాడలోని భాజపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "అధిష్ఠానం అస్తవ్యస్థ నిర్ణయాలతో కాంగ్రెస్ బాగా దెబ్బతింది.

కాంగ్రెస్ పార్టీ ఒక్కో రాష్ట్రంలో బలహీనపడుతోంది. పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తాం అన్నారు.. వద్దని చెప్పా. నీళ్ల సీసా కింద పడకముందే జాగ్రత్తపడాలి. కింద పడి పగిలాక నీళ్లను సీసాలో పోయలేమని చెప్పా. ప్రజలకు మేలు చేయవచ్చనే నమ్మకంతోనే భాజపాలో చేరా" అని చెప్పారు. తాను సీఎంగా ఉన్నప్పటి కంటే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎంతో సాయం అందిస్తోందన్నారు. రాష్ట్రానికి అవసరమైన నిధులను తీసుకొస్తామన్నారు. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగానికి లోబడే పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. "ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలూ నావే. హైదరాబాద్‌లో పుట్టా.. అక్కడే చదువుకున్నా.. అక్కడే ఉంటున్నా. నా తండ్రి సొంతూరు చిత్తూరు జిల్లా. వాయల్పాడు నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను. బెంగళూరులోనూ నాకు ఇల్లు ఉంది. కర్ణాటక కూడా నా స్వస్థలం అనొచ్చు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నివాసం ఉంటాను.

పార్టీకి ఎక్కడ పనిచేయమంటే అక్కడ చేస్తా. కష్టపడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయి. పదవులపై ఎవరితోనూ మాట్లాడలేదు. ఎన్నికల్లో టికెట్ ఆశించడం లేదు. నా పోటీపై తుదినిర్ణయం పార్టీ అధిష్ఠానానిదే. రాజధానిపై పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటాను" అని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

# ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో అగ్ని ప్రమాదం.. భయంతో పరుగులు తీసిన ఉద్యోగులు



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయం మూడో అంతస్థులోని కంప్యూటర్ యూపీఎస్ గదిలో ఒక్కసారిగా కెమికల్ బయటకు రావడంతో దట్టమైన పొగ అలముకుంది. దీంతో ఉద్యోగులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ట్రస్ట్ కార్యాలయానికి చేరుకున్నారు. మూడో అంతస్థు నుంచి పొగ బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో అద్దాలు పగులగొట్టారు. కార్యాలయాన్ని మూసివేసిన అధికారులు ఉద్యోగులను ఇళ్లకు పంపించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఆరోగ్య శ్రీ సేవలకు అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు.



# జగన్ టూర్.. బాలినేనికి చేదు అనుభవం

మార్కాపురం: మాజీ మంత్రి, వైకాపా ప్రాంతీయ సమన్వయ కర్త బాలినేని శ్రీనివాస్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. మార్కాపురంలో సీఎం పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ వద్దకు వెళ్తుండగా పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. దీంతో బాలినేని అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు. అయితే సభ ప్రారంభమయ్యేసరికి మాత్రం వేదికపై ఆయన కనిపించారు. సీఎం జగన్ జోక్యంతోనే బాలినేని అలకవీడినట్లు తెలిసింది.

**ఏం జరిగిందంటే..** మార్కాపురంలో 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' నిధులను సీఎం జగన్ విడుదల చేశారు. దీనిలో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా ముఖ్యనేతలు మార్కాపురం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో హెలిప్యాడ్ వద్దకు మంత్రులు, ఇతర నేతలు బయల్దేరారు. ఈ క్రమంలో బాలినేనిని పోలీసులు అడ్డుకున్నారు. వాహనం పక్కనపెట్టి నడిచి రావాలని ఆయనకు సూచించారు. దీంతో పోలీసులపై బాలినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వైఖరికి నిరసనగా అక్కడి నుంచి ఆయన వెనుదిరిగారు. నచ్చజెప్పేందుకు మంత్రి ఆదిమూలపు సురేశ్, జిల్లా ఎస్పీ, ఇతర నేతలు యత్నించినా బాలినేని శాంతించలేదు. సీఎం కార్యక్రమంలో పాల్గొనకుండానే తన అనుచరులతో ఆయన ఒంగోలుకు బయల్దేరారు. చివరికి సీఎం జగన్ కల్పించుకుని ఫోన్‌లో మాట్లాడటంతోనే బాలినేని అలకవీడి మళ్లీ సభకు వచ్చినట్లు సమాచారం.



# అమెరికా వీసా ఫీజులు పెరిగాయ్...!


హైదరాబాద్: అమెరికా వీసా ఫీజులు పెరిగాయి. ఈ ఏడాది మే 30వ తేదీ నుంచి కొత్త రుసుములు అమలులోకి రానున్నాయి. 2014 తర్వాత ఇప్పుడే ఫీజులు పెంచినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా ఎనిమిది రకాల వీసాల ఫీజులను పెంచింది. వీటిలో పర్యాటక వీసా బి1/బి2 ఫీజు పెంచటం చర్చనీయాంశంగా ఉంది. పెంపుదల జాబితాలో విద్యార్థి (ఎఫ్-1) వీసా లేకపోవటం తల్లిదండ్రులకు ఒకింత ఊరట కల్గించే అంశం. ఈ ఏడాదిలో అన్ని రకాల వీసాలకు సంబంధించి పది లక్షల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వాటిలో ఇప్పటికి నాలుగు లక్షలు పూర్తి చేసినట్లు దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. లక్ష్యాన్ని చేరుకుంటామన్న ఆశాభావంతో ఉన్నట్లు పేర్కొంది.

**త్వరలో విద్యార్థి వీసా స్లాట్లు :** త్వరలో విద్యార్థి(ఎఫ్-1)వీసా ఇంటర్వ్యూ స్లాట్లు విడుదల చేసేందుకు అమెరికా ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రతి ఏటా రెండు సీజన్లలో అమెరికాలోని విద్యా సంస్థలు ప్రవేశాలు నిర్వహిస్తుంటాయి. స్ప్రింగ్ సీజనుకు సంబంధించి త్వరలో ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. మే నెల నుంచి ఆగస్టు వరకు విద్యార్థి వీసా దరఖాస్తులను దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంతోపాటు హైదరాబాద్, చెన్నై, ముంబయి, కోల్‌కతాలలోని అమెరికా కాన్సులేట్ కార్యాలయాలు అనుమతిస్తాయి. గడిచిన ఏడాది పెద్ద సంఖ్యలో విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. ఈ దఫా కూడా పెద్ద సంఖ్యలోనే వీసాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. గడిచిన స్ప్రింగ్ సీజను కన్నా 25 నుంచి 30 శాతం ఎక్కువగా వీసాలు జారీ అవుతాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఫాల్ సీజనుతో పోలిస్తే స్ప్రింగ్ సీజనులోనే విద్యార్థులు ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికా వెళతారు.

**పెరిగిన వీసా ఫీజులు (అమెరికా డాలర్లలో)**

| వీసా విభాగం | ప్రస్తుతం | పెంపు తర్వాత |
|---|---|---|
| బి1/బి2 | 160 | 185 |
| హెచ్, ఎల్, ఓ, పీ, క్యూ, ఆర్ | 190 | 205 |
| ఇ | 205 | 315 |

# పాపాలన్నీ చేసి ఇళ్లకు స్టిక్కర్ లు వేస్తే ప్రజలు హర్షించరు



మైలవరం : ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో మాజీ సర్పంచ్ సూరనేని సూరిబాబు వర్ధంతిలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ.. కొత్తూరు తాడేపల్లి, వేమవరం, నైనవరంలో అక్రమంగా గ్రావెల్ తోలకాలు జరిగినట్లు అధికారులు నివేదిక అందజేశారన్నారు. అధికారులు ఇచ్చిన నివేదిక పై ఇప్పుడు ఎం సమాధానం చెబుతావని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను ప్రశ్నించారు.

ఇంకా దేవినేని ఉమ మాట్లాడుతూ.. "కొండపల్లి అడవిలో గ్రావెల్ అమ్ముకుంది ఎవరు? అధికారులు ఫైన్ వేస్తే కట్టింది ఎవరు? అటవీ అధికారులను బదిలీ చేయించింది ఎవరు? తప్పు చేయకపోతే రూ.10 లక్షలు ఫైన్ ఎందుకు కట్టారు? మీ బామ్మరిది.. నీ బినామీ కాదా? అక్రమార్కులను అరెస్ట్ చేసి.. జైల్లో పెట్టాలి. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద 10 రెట్లు వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయాలి. నీ రాజీనామా డ్రామాలు కట్టిపెట్టి ఎమ్మెల్యే సమాధానం చెప్పు. నువ్వు, మీ పార్టీ నాయకులు తప్పు చేసినట్టు రుజువు అయింది. మైలవరం నియోజకవర్గంను దోచుకోవడానికే ఆగర్భ శ్రీమంతుడు అనే ముసుగు వేసుకొని వసంత ఎమ్మెల్యే అయ్యాడు. పాపాలన్నీ చేసి ఇళ్లకు స్టిక్కర్‌లు వేస్తే ప్రజలు హర్షించరు. ఎమ్మెల్యే, అతని అనుచరులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు.

# ఈ రేంజ్ లో లుక్కిస్తే ఎలా సామ్?

స్టార్ హీరోయిన్ సమంత అందానికి అభినయానికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ఏమాయ చేశావే సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టి.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన ఈ ముద్దుగుమ్మ తన అందం అభినయంతో తెలుగు సినీ ప్రేక్షకుల గుండెల్లో గూడు కట్టుకుంది. ఆ తర్వాత కూడా స్టార్ హీరోల సరసన నటిస్తూ.. బాగానే పేరు సంపాధించుకుంది. కేవలం సినిమాల ద్వారానే కాకుండా సోషల్ మీడియా ద్వారా కూడా అభిమానులకు టచ్ లో ఉంటుంది. తన పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన అన్ని అప్ డేట్లను షేర్ చేసుకుంటూ ఉంటుంది. మధ్యలో తన ఆరోగ్యం బాగాలేక చాలా రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉన్న ఈ ముద్దుగుమ్మ గత రెండు మూడు నెలలుగా మళ్లీ యాక్టివ్ అయింది. ఎప్పటికప్పుడు తన ఫొటోలను షేర్ చేస్తూ...



అందరినీ ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా సామ్ కు సంబంధించిన కొన్ని ఫొటో నెట్టింట వైరల్ గా మారాయి. షాట్ హెయిర్ తో క్యూట్ గా చూస్తున్న సామ్ ఈ ఫొటోలో అదిరిపోయింది. మరోవైపు తాను వేసుకున్న డ్రెస్ స్ట్రిప్ జారిపోతుండగా.. అభిమానుల వైపు అదోలా చూస్తూ ఆహా అనిపిస్తోంది. చేతిలో రెండు రకాల చిన్న చిన్న పూలు ఉన్న చెట్లను పట్టుకున్న ఈ ముద్దుగుమ్మ... సింగిల్ పీస్ తో రెచ్చిపోయింది. స్కిన్ కేర్ మాయిశ్చరైజర్ కు సంబంధించిన ఓ కంపెనీ.. వాటిని తయారు చేసే పూలు చెట్లను పట్టుకొని సామ్ ఫొటోలు దిగింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు సామ్ లుక్ కు చొంగ కార్చుకుంటున్నారు. ఇంత స్టైలిష్ గా ఉన్న నిన్ను చూస్తే తట్టుకోలేక పోతున్నామంటూ కామెంట్లు చేస్తున్నారు. సామ్ నీ అందం రోజు రోజుకూ పెరిగిపోతోందంటూ చెబుతున్నారు. ఇటీవలే సమంత క్రియేటివ్ డైరెక్టర్ గుణశేఖర్ దర్శకత్వంలో శాకుంతలం సినిమాలో నటించింది. కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలం నవల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. డీఆర్పీ గుణా టీమ్ వర్క్స్ పతాకంపై గుణశేఖర్ కుమార్తె నీలిమ గుణ భారీ బడ్జెట్ తో చిత్రాన్ని నిర్మించారు. తెలుగుతో పాటు హిందీ తమిళ మలయాళ కన్నడ భాషల్లో ఏప్రిల్ 14వ తేదీన ఈ చిత్రం రిలీజ్ కాబోతుంది.

# హీరోల వయసుతో సంబంధం లేదంటున్న శృతి హాసన్..!

కమల్ గారాల పట్టి శృతి హాసన్ ప్రస్తుతం తెలుగులో మళ్లీ ఫామ్ లోకి వచ్చింది. కెరీర్ మొదట్లో వరుస ఫ్లాపులతో ఐరన్ లెగ్ ముద్ర వేసుకున్న అమ్మడు పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ తో సూపర్ హిట్ అందుకుంది. ఇక అక్కడ నుంచి వరుస స్టార్ సినిమాలు చేస్తూ సూపర్ పాపులర్ అయ్యింది శృతి హాసన్. తనకు హీరోయిన్ గా స్టార్ ఇమేజ్ వచ్చింది తెలుగు సినిమాల వల్లే అంటూ రీసెంట్ ఓ స్పెషల్ చిట్ చాట్ లో చెప్పుకొచ్చింది శృతి హాసన్. అందుకే తెలుగు పరిశ్రమ మీద విశ్వాసంగా ఉంటానని అంటుంది శృతి హాసన్. అంతేకాదు కథ నచ్చితే హీరోల వయసు గురించి పట్టించుకోను.. చిరంజీవి గారితో చేసిన వాల్తేరు వీరయ్య బాలకృష్ణ గారితో చేసిన వీర సింహా రెడ్డి ఈ రెండు సినిమాలు కథ నచ్చబట్టే చేశానని అలాగే



ఆ రెండు సినిమాలు పెద్ద హిట్ అయ్యానని అన్నారు శృతి హాసన్. ప్రస్తుతం ది ఐ అనే హాలీవుడ్ సినిమాతో పాటుగా ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రశాంత్ నీల్ టేకింగ్ ఒక లెవల్ లో ఉంటుంది. అయితే ఆ సినిమా గురించి తాను ఇప్పుడు ఎక్కువగా చెప్పలేనని అన్నారు శృతి హాసన్. తొలి సినిమా హిందీలో చేశా.. నాన్న కమల్ హాసన్ బ్యానర్ లో రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లో హీరోయిన్ గా ఛాన్స్ ఇస్తే చేస్తానని అన్నారు. సినిమాల్లో ప్రత్యేకంగా జీవిత లక్ష్యమేమి లేదని.. సొంత కాళ్లపై ధైర్యంగా నిలబడటమే ముఖ్యమని అన్నారు. జీవితంలో పెళ్లి ఒక భాగం మాత్రమే అదే జీవితం కాదని అన్నారు శృతి హాసన్. డిప్రెషన్ తో బాధపడుతున్న వారికి కౌన్సిలింగ్ అనేది బాగా అవసరం.. అలాంటి బాధితులు కూడా తమ బాధలను బహిరంగంగా వ్యక్తపరచాలి.. వారి కోసం ఒక సంస్థను ఏర్పాటు చేస్తున్నానని అన్నారు శృతి హాసన్.




# మళ్లీ సీతగా... మృణాల్ ఇంట్రెస్టింగ్ ఆన్సర్




బుల్లి తెర నుండి బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చి హీరోయిన్ గా వరుసగా సినిమాలు చేస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఈ అమ్మడు తెలుగు నటించిన మొదటి చిత్రం సీతారామం భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రంలో మృణాల్ పోషించిన సీత పాత్ర ను తెలుగు ప్రేక్షకులు మర్చిపోలేక పోతున్నారు. అందుకే మృణాల్ ఠాకూర్ ను సోషల్ మీడియా ద్వారా మళ్లీ మళ్లీ సీతారామం పాత్ర గురించి.. సినిమా సీక్వెల్ గురించి అడుగుతూనే ఉంటారు. తాజాగా ఈ అమ్మడు నటించిన ఒక హిందీ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా సోషల్ మీడియాలో అభిమానులతో చిట్ చాట్ చేసింది. ఆ సందర్భంగా మృణాల్ ను ఒక ఫ్యాన్ సీతారామం 2 సాధ్యం అయ్యేనా అంటూ ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు మృణాల్ స్పందిస్తూ.. నాకు దాని గురించి ఐడియా లేదు... కానీ సీక్వెల్ చేయాలని.. చేస్తే నటించాలని మాత్రం ఉంది అంటూ క్లారిటీ ఇచ్చింది. ఇప్పుడు దర్శకుడు ఎలా స్పందిస్తాడు.. ఆయన ఉద్దేశ్యం ఏంటి అనేది చూడాలి. గతంలో సీతారామం సినిమా సీక్వెల్ గురించి దుల్కర్ సల్మాన్ ను ప్రశ్నించిన సందర్భంగా ఒక వేళ సీక్వెల్ ఉన్నా కూడా నేను ఎలా ఉండగలను.. పార్ట్ 1 లో నేను చనిపోయాను కదా అన్నట్లుగా ఆయన సరదాగా కామెంట్ చేశాడు. హను రాఘవపూడి కూడా సీతారామం సినిమా యొక్క సీక్వెల్ పై ఆసక్తిగా లేను అన్నట్లుగా క్లారిటీ ఇచ్చాడు. సూపర్ హిట్ చిత్రాలన్నింటికి కూడా సీక్వెల్ అంటే సాధ్యం కాదు. కానీ సీత పాత్రను తీసుకుని మరో విభిన్నమైన కథతో సినిమాను తీస్తే బాగుంటుందని మాత్రం కొందరు ఆ మధ్య దర్శకుడు హను రాఘవపూడి కి సూచించారు. ఆయన ప్రయతిస్తాడా లేదా అనేది చూడాలి. ఇక మృణాల్ సినిమాల విషయానికి వస్తే తెలుగు లో సీతారామం తర్వాత చాలానే ఆఫర్లు వచ్చాయి. కానీ కథ మరియు పాత్ర విషయంలో కాస్త ఎక్కువ ఆలోచించడం వల్ల ఇప్పటి వరకు నాని సినిమాకు మాత్రమే కమిట్ అయింది. ప్రస్తుతం ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలో ఆ సినిమాల్లో ఒకటి అయినా కన్ఫర్మ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# సీనియర్ భామలు మెలితిప్పేస్తున్నారే!



రంగుల ప్రపంచంలో హీరోయిన్ల మధ్య పోటీ ఎలా? ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. వెండి తెర పై ఒకరికొకరు పోటీ పడి నటించడానికి ఏమాత్రం వెనకడుగు వేయరు. అద్భుతమైన నటనే కాదు. అవసరమైతే అదే రేంజ్ లో అందాలు ఆరబోస్తున్నారు. స్కిన్ షో..గ్లామర్ షో..క్లీవేజ్ షో అంటూ రచ్చ మామూలుగా ఉండదు. అవసరం మేర ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించడానికి ఏమాత్రం వెనుకడుగు వేయరు. సహజంగా ఈ పోటీ వాతావరణం ఎక్కువగా నవతరం నాయికల్లో కనిపిస్తుంది. కానీ ఈ విషయంలో సీనియర్ భామలు కూడా తక్కువేం కాదని నిరూపిస్తున్నారు. తమన్నా..కాజల్ అగర్వాల్..సమంత..శ్రుతి హాసన్ లు సైతం ఒకరికొకరు స్కిన్ షో విషయంలో పోటీ పడుతున్నారు. ఈ మధ్యనే రిలీజ్ అయిన 'వీరసింహారెడ్డి'లో శ్రుతిహాసన్ ఎలా చెలరేగిందో? తెలిసిందే. సీనియర్ స్టార్ బాలయ్య సరసన గ్లామర్ డాల్ గా ఆకర్షించింది. ఇన్ స్టా గ్లామర్ క్వీన్ లా వెండి తెర పై చెలరేగింది. స్కిన్ షో ఎలివేషన్ లో తనదైన మార్క్ వేసింది. బాలయ్యకి? కుమార్తె వయసున్న శ్రుతిహాసన్ ఏంటి? అని విమర్శించిన వారికి నోటి మీద వేలేసుకునేలా సమాధానం ఇచ్చింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోనూ తనదైన మార్క్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంది. అలాగే చందమామ కాజల్ అగర్వాల్ మమ్మీ అయినా అందం ఏమాత్రం తరిగిపోలేదు. కాస్త బొద్దు గా తయరైనా బ్యూటీ విషయంలో ఎక్కడా చెక్కు చెదరలేదు. 'ఇండియన్ -2'లో అందాల విందు చేయనుందని అభిమానులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. శంకర్ సినిమా అంటే? పాత్రకి అనుగుణంగా ఎవరైనా సిద్దం కావాల్సిందే కాబట్టి చందమామ అందాలపై ఆశలు భారీగానే ఉన్నాయి. ఇక మిల్కీబ్యూటీ తమన్నా ఇంకా కుర్ర భామలాగే చెలరేగుతుంది. పాల అందాలతో అదే ఛరిష్మాతో కొనసాగుతుంది. చిన్న సినిమాల్లో సైతం తనదైన శైలి అందాల ఆరబోత తప్పనిసరి అంటోంది. మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తోన్న 'భోళాశంకర్' లో తమన్నా అందాలు విచ్చలవిడిగానే ఉంటాయని అంచనాలున్నాయి. మెహర్ రమేష్ సినిమాల్లో హీరోయిన్లను గ్లామరస్ బ్యూటీలుగా ఆవిష్కరిం చడం ఆయన స్టైల్. అయితే అన్నయ్యతో సినిమా కాబట్టి ఆ విషయంలో కాస్త బ్యాలెన్స్ గా ఉండే ఛాన్స్ ఉంది. ఇక వీళ్లందరికంటే సమంత గ్లామర్ ఎలివేషన్ లో చాలా అడ్వాన్స్ గా ఉంది. 'ఊ అంటావా' పాటతో దేశాన్ని తన అందాలతో కట్టిపడేసింది. ఇండియన్ వెర్షన్ 'సీటాడెల్' సిరీస్ లోనూ సమంత కొన్ని ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ నటిస్తుందని ప్రచారం సాగుతోంది. ఆ రకంగా ఈ నలుగురు భామలు నవ నాయికల్లే మించిపోతున్నారు.

# ఆ చూపులతో మత్తెక్కిస్తోంది

సోషల్ మీడియా ద్వారా జూనియర్ సమంత అంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకుని ఆ తర్వాత బుల్లి తెర పై ఎంట్రీ ఇచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపును మరియు ఇమేజ్ ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ అషు రెడ్డి. బుల్లి తెర పై ఈ అమ్మడి జోరు బిగ్ బాస్ తో పీక్స్ కు చేరింది. పవన్ ను అభిమానిస్తాను అంటూ చెప్పడంతో పాటు ప్రైవేట్ పార్ట్ లో పవన్ పేరును టాటూ



వేయించుకోవడం తో చాలా మంది దృష్టిలో పడింది. అషురెడ్డి యొక్క అందాల ఆరబోత గురించి ఎంత చెప్పినా తక్కువే అనడంలో సందేహం లేదు. హీరోయిన్స్ రేంజ్ లో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఉంటుంది. అందాల విందు తో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఫాలోవర్స్ ను సొంతం చేసుకున్న ఈ అమ్మడు హీరోయిన్స్ కు ఏ మాత్రం తక్కువ కాదు అంటూ ప్రతి ఫొటో షూట్ తో నిరూపించుకుంటూ ఉంది. రెండు మిలియన్ ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడి యొక్క అందాల విందు జాతర ఫొటో షూట్స్ మతి పోగొడుతూ ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫొటో షూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

ఈసారి తన చూపుతో నెటిజన్స్ కు అభిమానులకు మత్తు మందు జల్లిందా అన్నట్లుగా చూస్తూ మతి పోగొడుతోంది.

ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం.. ఆ ఫిజిక్ ను అషు రెడ్డి ఎప్పుడు కూడా చాలా అందంగా అలంకరించుకుని చూపిస్తుంది అనడంలో సందేహం లేదు. అందంగా ఉండటం ఒక ఎత్తు అయితే.. ఆ అందాన్ని మరింత అందంగా చూపించడం మరో ఎత్తు. తన అందాన్ని రెట్టింపు అందంగా కనిపించేలా ఈ అమ్మడు ఎప్పుడు కూడా సందడి చేస్తుంది అనడంలో సందేహం లేదు.

# ఎద అందాలతో మెరిసిపోతున్న రాశిఖన్నా

టాలీవుడ్ హాట్ బ్యూటీ రాశిఖన్నా ఈ మధ్య గ్లామర్ డోస్ కాస్తా పెంచింది అని చెప్పాలి. టాలీవుడ్ లో సూపర్ సక్సెస్ అందుకున్న ఈ అమ్మడు ఫోకస్ అంతా ఇప్పుడు బాలీవుడ్ మీద ఉంది. హిందీలో రెండు సినిమాలు ఈమె చేతిలో ఉన్నాయి. ఇక ఇప్పటికే డిజిటల్ ఎంట్రీ కూడా ఇచ్చిన రాశిఖన్నా డిఫరెంట్ క్యారెక్టర్స్ తో దూసుకుపోతుంది. హీరోయిన్ గానే కాకుండా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలకి కూడా ఒకే చెబుతుంది. రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్ నుంచి బయటకి రావాలని ప్రయత్నం చేస్తున్న ఈ బ్యూటీ ఆ దిశగానే తన సినిమాల ఎంపిక కూడా చేసుకుంటూ ఉండటం విశేషం. రాశిఖన్నా చివరిగా తెలుగులో నాగ చైతన్య హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్ లో వచ్చిన థాంక్యూ మూవీలో నటించింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. తమిళంలో కార్తికి జోడీగా సర్దార్ సినిమాలో నటించింది.



ఇక ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ మూవీలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా రాశిఖన్నా నటించి మెప్పించింది. షాహిద్ కపూర్ కి జంటగా రొమాంటిక్ సన్నివేశాలలో కూడా ఈ అమ్మడు రెచ్చిపోవడం విశేషం. ఇదిలా ఉంటే హిందీలో యోద సినిమాలో ప్రస్తుతం నటిస్తుంది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తుంది. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో రాశిఖన్నా యాక్టివ్ గా ఉంటుంది. హాట్ హాట్ ఫోటోలని రెగ్యులర్ గా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తుంది. తాజాగా ఈ అమ్మడు పింక్ విల్లా ఫ్యాషన్ ఈవెంట్ లో సందడి చేసింది. ఈ ఈవెంట్ లో పింక్ కలర్ మోడరన్ అవుట్ ఫిట్ తో మెరిసిపోయింది. ఈ కాస్ట్యూమ్స్ లో ఎద అందాలని చూపిస్తూ కుర్రాళ్ళని రాశిఖన్నా టెంప్ట్ చేస్తుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్స్టాగ్రామ్ లో వైరల్ గా మారాయి. వీటిని ఏకంగా2.30 లక్షల మంది లైక్ చేయడం విశేషం.



## జర్నలిస్టులకు అండగా సీఎం కేసీఆర్: మంత్రి హరీశ్ రావు



ఆందోల్: తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని మంత్రి హరీశ్ రావు అన్నారు. సమాజ హితంకోసం కృషిచేసే వృత్తి జర్నలిజమని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 12 వేల అక్రిడేటెడ్ జర్నలిస్టులు ఉంటే, తెలంగాణలో 21,295 అక్రిడేషన్లు ఉన్నాయని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు ఇచ్చారని తెలిపారు. రూ.15 కోట్లతో మీడియా భవన్ నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. ఆందోల్ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలిసి మంత్రి హరీశ్ రావు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నదని చెప్పారు. ప్రజలకు వాస్తవాలను చెప్పే బాధ్యత జర్నలిస్టులదేనని వెల్లడించారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చొరవతో నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం సంతోషంగా ఉందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా జర్నలిస్టులకు కష్టసుఖాల్లో సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని చెప్పారు. మీడియా భవన్ కట్టించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 వేల అక్రిడేటెడ్ జర్నలిస్టులు ఉన్నారని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రి హరీశ్ రావు చొరవతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం సాధ్యమైందన్నారు.

## సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ కళాశాల ప్రారంభించిన మంత్రులు కేటీఆర్, నిరంజన్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ కళాశాల నూతన భవన సముదాయాలను మంత్రులు కేటీఆర్, నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం భవన సముదాయాలను పరిశీలించారు. మంత్రుల వెంట అతిథులుగా శాసనసభా సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి హాజరయ్యారు. 2018 ఆగస్టు 9న తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో వ్యవసాయ కళాశాల భవనాల సముదాయానికి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే ఏడాది పీజేటీఎస్ఏసీ ఆధ్వర్యంలో ఎంసెట్ ద్వారా విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభం కాగా, సర్దాపూర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిల్ కళాశాలలో తరగతులను ప్రారంభించారు. మొదటి బ్యాచ్‌లో 56 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, వారు 2022 ఆగస్టులో వ్యవసాయ డిగ్రీలో పట్టభద్రులయ్యారు. ఒక బ్యాచ్ పూర్తి కాగా, ప్రస్తుతం బీఎస్సీ అగ్రికల్చర్‌లో 190 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. కొత్త భవనంలోకి మార్చిన తర్వాత మరిన్ని కోర్సులతోపాటు ప్రతి విభాగంలో 120 సీట్లకు అప్‌గ్రేడ్ చేయనున్నారు. ప్రస్తుతం 23 మంది బోధన, 19 మంది బోధనేతర సిబ్బంది ఈ డిగ్రీ కళాశాలలో సేవలు అందిస్తున్నారు.

**ఆధునిక హంగులతో నూతనప్రాంగణం :** తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల శివారులో 35 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 69.50 కోట్లతో సకల వసతులతో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కనే అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థుల సౌకర్యార్థం 16 ఎకరాల్లో జీ ప్లస్ 2 పద్ధతిలో కళాశాల భవనం, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరు హాస్టళ్లు, 19 ఎకరాల్లో వ్యవసాయ పరిశోధనా క్షేత్రం, ఫాంలాండ్స్‌ను నిర్మించారు. ఆధునిక టెక్నాలజీతో నూతన ప్రాంగణాన్ని అందుబాటులోకి తెచ్చారు. అత్యాధునిక వసతులతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, సెమినార్ హాళ్లు, అధ్యాపకుల గదులు, అసోసియేషన్ డీన్ చాంబర్, మోడ్రన్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఈ కళాశాల రాష్ట్రంలోనే రెండోది కావడం జిల్లాకే గర్వకారణం. వ్యవసాయ కళాశాల వల్ల ఇటు వ్యవసాయ శాస్త్రవేత్తలు తయారు కావడమే కాకుండా, పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరంగా మారనున్నది. ఈ నేపథ్యంలో సాంకేతిక విద్య వ్యవసాయంలో నిర్ణయాత్మక పాత్రను పోషించే అవకాశమున్నది.

**ఎడ్యుకేషన్ హబ్‌గా సిరిసిల్ల :** కార్మిక, ధార్మిక క్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్నది. మంత్రి కేటీఆర్ చొరవతో విద్యారంగంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నది. సకల సౌకర్యాలతో కూడిన ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు, ఉపాధినిచ్చే వృత్తి విద్యలోనూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసానిస్తూ సిరిసిల్లను విద్యాహారంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలోనే తొలి కేజీ టూ పీజీ క్యాంపస్, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ కళాశాల, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐ, నర్సింగ్, జేఎన్‌టీయూ కాలేజీలు వచ్చాయి. రాష్ట్రంలోనే తొలి ఫైన్ ఆర్ట్స్ కళాశాల, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ కూడా ఏర్పాటైన విషయం తెలిసిందే. రాబోయే విద్యాసంవత్సరం నుంచి మెడికల్ కాలేజీ కూడా ప్రారంభం కానున్నది. దీంతో విద్యార్థులు స్థానికంగానే ఉన్నత విద్యాభ్యాసం చేసే అవకాశం లభిస్తున్నది. ఒకవైపు ఎడ్యుకేషన్ హబ్, మరోవైపు పరిశ్రమల రాకతో ఇండస్ట్రియల్ హబ్‌గా నిలువడంతో పాటు వేలాది మందికి ఉపాధి లభించనున్నది.




నిత్యం అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీగా ఉండే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కొంతసేపు సేద తీరారు.. కల్లు తాగి అలసటను తీర్చుకున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. గీత కార్మికుల కోరిక మేరకు కల్లు తాగి.. 'వారెవ్వా ఎంత అద్భుతంగా ఉంద'ని కితాబిచ్చారు. చిన్నతనంలో తన తండ్రితో పొలం పనులకు వెళ్లిన సమయంలో కల్లు తాగేవాడినని.. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.




తన వ్యాఖ్యలపై ఏపీ మంత్రులు రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి హరీశ్ రావు ఫైరయ్యారు. ఏపీకి చెందిన పలువురికి రెండు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నాయని.. అలా ఉంటే ఇక్కడే ఓటు ఉంచుకోవాలని చెప్పానన్నారు. తెలంగాణలో ఏముందో ఇక్కడికి వచ్చి చూస్తే వారికి అర్థమవుతుందన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలో భారాస ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్ పాల్గొన్నారు. ఏపీకి ప్రత్యేక హెూదా తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఇప్పుడు మాట్లాడట్లేదని హరీశ్ చురకలంటించారు.

## సీఎం కేసీఆర్‌ను అభాసుపాలు చేయడానికి బీజేపీ కుట్ర: మండలి చైర్మన్ గుత్తా



నల్లగొండ: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన బీజేపీ కార్యక్రమంలా మారిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమంతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి ఏం సంబంధమని, ఆయన ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. ప్రధాని ప్రసంగమంతా ముఖ్యమంత్రి కేసీఆర్‌ని తిట్టడానికే పరిమితమైందన్నారు. నల్లగొండలోని తన నివాసంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌పై ఆరోపణలతో బీజేపీ కాలం నెట్టుకొస్తున్నదని, ముఖ్యమంత్రిని అభాసుపాలు చేయడం కోసం కుట్రలు పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్–విజయవాడ హైవేను మూడేండ్ల కిందటే ఆరు లేన్లు చేయాల్సి ఉందని, ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. ఎహెచ్65 నుంచి 565 హైవే లింక్ చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి పలుమార్లు లేఖలు రాసినా స్పందన లేదని చెప్పారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలోనే నల్లగొండ–మాచర్ల రైల్వే లైన్ కేటాయించారని, అయినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వీటన్నింటిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ నేతలు మాట్లాడరని విమర్శించారు. రామ భజన, ధరల పెంపు తప్పితే ప్రజలకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. ప్రతిపక్షాలు మంత్రి కేటీఆర్‌ను టార్గెట్ చేయడం దుర్మార్గమని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్లమెంటులో మాట్లాడుకొని ఓ అభిప్రాయానికి వచ్చినట్లు కనిపిస్తున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై ఆరోపణలు చేసి హైదరాబాద్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. దేశంలో సమాఖ్య వ్యవస్థను కాపాడాలనే ముఖ్యమంత్రి తాపత్రయమని వెల్లడించారు. ఎప్పుడు గద్దెనెక్కి రాష్ట్రాన్ని దోచుకోవాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. వారికి అధికార యావ తప్పితే మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన హామీల అమలులో కేంద్రంలోని బీజేపీ విఫలమైందని చెప్పారు. ఆ పార్టీ పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. సీబీఐ, ఈడీ కేసుల మాఫీ కోసమే ప్రతిపక్షాల నాయకులు బీజేపీలో చేరుతున్నారని ఆరోపించారు. కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకుని విపక్షాలు, రాష్ట్రాలపై కేంద్రంలోని బీజేపీ పెత్తనం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గవర్నర్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పక్కకు పెట్టడం సరికాదన్నారు. గవర్నర్‌లు అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కావొద్దన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన అని గుత్తా సుఖేందర్ రెడ్డి వెల్లడించారు.

## బయ్యారంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయకుండా కేంద్రం కుట్ర: పువ్వాడ అజయ్



హైదరాబాద్: విశాఖ స్టీల్‌ప్లాంట్ వెనుక కుట్ర జరుగుతోందని తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా గనులను కేంద్ర ప్రభుత్వం అదానీ పరం చేస్తోందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని భారాస శాసన సభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పువ్వాడ మాట్లాడారు. "విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ గనులు లేకుండా చేసి దాన్ని మూసివేసేందుకు యత్నిస్తున్నారు. బైలదిల్లా నుంచి ఐరన్ ఓర్‌ను ముంద్రాకు తరలించేందుకు కుట్ర చేస్తున్నారు. ఆ గనులను బయ్యారానికి కేటాయించకుండా గుజరాత్‌కు తరలిస్తున్నారు. అదానీ కోసమే బైలదిల్లా నుంచి 1800కి.మీ.దూరంలోని ముంద్రాకు తరలిస్తున్నారు. బయ్యారంలో ఎప్పటికీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జరగకుండా కుట్ర జరుగుతోంది. అక్కడ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం ముందుకొస్తే మౌలిక వసతుల్లో 50 శాతం ఖర్చు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని పువ్వాడ అజయ్ చెప్పారు.

## కారేపల్లి ఘటనపై సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి.. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



హైదరాబాద్ : ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన ఘోర ప్రమాదం పట్ల బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి సమీపంలో ఊహించని రీతిలో సిలిండర్లు పేలి ఇద్దరు కార్యకర్తలు మరణించడం, పలువురికి తీవ్ర గాయాలవడం బాధాకరమన్నారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే ఖమ్మం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కు, ప్రమాదం జరిగిన ప్రాంతంలో వున్న ఎంపీ నామా నాగేశ్వర్ రావులకు ఫోన్లు చేసి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. మరణించిన కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. తాము అండగా వుంటామని స్పష్టం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆదేశించారు.

## దిశ ఎన్‌కౌంటర్ ఘటనపై హైకోర్టులో విచారణ



హైదరాబాద్: దిశ ఎన్‌కౌంటర్ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపింపించారు. ఎన్‌కౌంటర్ బాధితుల తరపున హైకోర్టులో లాయర్ కృష్ణమాచార్య వాదించారు. ఈ సందర్భంగా లాయర్ కృష్ణమాచార్య మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 10 మంది పోలీసులకు హైకోర్టు నోటీసు ఇచ్చిందన్నారు. ఎన్‌కౌంటర్ సమయంలో సీపీగా ఉన్న సజ్జనార్‌కు నోటీస్ అందుకున్నారని పేర్కొన్నారు. నోటీసులో తమ వాదన వినిపించాలని హైకోర్టు పేర్కొందని తెలిపారు. మరోవైపు ఎన్‌కౌంటర్ లో పాల్గొన్న పోలీసులపై సెక్షన్ 302 ప్రకారం కేసు పెట్టాలని హైకోర్టు కోరామన్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి అని కూడా కోరినట్లు ఆయన వెల్లడించారు. హైకోర్టు నష్టపరిహారం అంశంలో సానుకూలంగా ఉన్నట్టు అనిపిస్తోందన్నారు. దిశ కేసు తుది ఘట్టానికి చేరుకున్నట్టు తెలుస్తోందని, మరో రెండు వాయిదాల్లో తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. హైకోర్టు ఈ కేసును జూన్ 21 వాయిదా వేసింది.

## అత్యాచారం చేసి ఆపై నిప్పంటించి చంపేశారు!



పహడీషరీఫ్: హైదరాబాద్‌లో దారుణం జరిగింది. గుర్తుతెలియని మహిళపై దుండగులు అత్యాచారం చేసి చంపేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన పహడీషరీఫ్ పరిధిలోని తుక్కుగూడలో చోటుచేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ–శ్రీశైలం రహదారిపై ఓ ప్లాస్టిక్ సంచి అనుమానాస్పదంగా కనిపించింది. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు.. సంచిని విప్పి చూడగా అందులో మహిళ మృతదేహం ఉంది. దుండగులు అత్యాచారం చేసి గొంతునులిమి.. ఆపై నిప్పంటించి హతమార్చినట్లు ఘటనాస్థలిలో పరిస్థితులను బట్టి అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com